Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 346 | కరీంనగర్ | బుధవారం 6 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## మమత వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం

**- రాజీనామా చేయనంటే డిస్మిస్ చేస్తారు**

**- అసోం సిఎం హిమంత్ బిశ్వశర్మ ఘాటు వ్యాఖ్యలు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

గువాహటి, మే 5 : పశ్చిమబెంగాల్‌లో తాను ఓడిపోలే దని, రాజీనామా చేసేది లేదని టీఎంసీ అధినేత్రి మమతాబెనర్జీ చేసిన వ్యాఖ్యలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఘాటుగా స్పందించారు. 'అప్పుడు ఒకటే మార్గం ఉంటుంది. డిస్మిస్ చేయడమే' అని ఒక ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. చాలా కాలంగా ఆమెను ప్రజలు భరిస్తూ

11 లో

## తమిళనాట కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కసరత్తు

**- 7న ప్రమాణం చేస్తామని ప్రకటించిన టివికె**

**- గవర్నర్‌కు లేఖ రాసిని టివికె చీఫ్ విజయ్**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై, మే 5 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన తమిళగ వెట్రి కళగం పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహకాలు చేస్తోంది. పార్టీ అధినేత విజయ్ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక కావడంతో ఈనెల 7న కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్

11 లో



## బెంగాల్, అసోంలలో ఓట్ చోరీ

**- జనాదేశాశ్‌ను చోరీచేసిన బిజెపి**

**- మరోమారు రాహుల్ విమర్శలు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 5 : బెంగాల్, అసోంలో ఓటు చోరీ జరగిందని విపక్షనేత రాహుల్ మరోమారు ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో చర్చనీయాం శంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఓటమి చెందడంతో కొందరు కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో జనాదేశాన్ని బీజేపీ చోరీచేసిందని ఆరోపించారు. ఇది కేవలం ఓ పార్టీ ఓటమి కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేసే ప్రమాదకర పరిణామం అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. సంకుచిత రాజకీయ ప్రయోజనా లను పక్కనపెట్టి.. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణపై అన్ని పార్టీలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా రాహుల్ పిలుపునిచ్చారు. 'ఇది ఒక పార్టీకి

11 లో




## నేను ఓడిపోలేదు.. రాజీనామా చేయను

**- బిజెపి కుట్రలతో గెలిచింది..**

**-తొత్తుగా మారిన ఎన్నికల సంఘం**

**- ప్రధాన విలన్ ఎన్నికల కమిషనర్...**

**- మమతా బెనర్జీ వ్యాఖ్యలు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

కోల్‌కతా, మే 5 : పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందు వల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. లోక్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలి సారి మీడియా సమావేశంలో మంగళవారంనాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..ఇసి,

11 లో





## ప్రాణహిత-చేవెళ్ళకు జాతీయ హోదా కల్పించాలి

**- పోలవరంకు జాతీయ హోదా ఇచ్చి, తెలంగాణను విస్మరిస్తే ఎలా**

**- ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వక పోవడం వివక్షే**

**- ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం సరికాదు**

**- నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమే**

**- పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా**

**- ప్రధాని మోడీకి భట్టి విక్రమార్క విజ్ఞప్తి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్నసిరిసిల్ల, మే 5 : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజైన్ చేసిన

11 లో

## మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

**- రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం**

**- నేటిలోగా సమాధానం రాకపోతే ఆందోళన తీవ్రం**

**- ప్రభుత్వాన్ని హెచ్చరించిన కెటిఆర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, మే 5 : రాష్ట్రంలో సుమారు 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండించారని, అయితే ఆ మేరకు కొనుగోలు ప్రణాళికలు రూపొందించ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం కేవలం 10 లక్షల టన్నుల పంటను మాత్రమే కొనుగోలు చేయాలని భావిస్తోం దని, మిగతా పంటను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. పంటను కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల వర్షాల కారణంగా పంట దెబ్బతింటుందని, దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. కేటీఆర్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. అనంతరం జనగామ మండలంలోని యశ్వంతపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ సందర్శించారు. అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగు తోందని రైతులు కేటీఆర్ దృష్టికి

11 లో

శాసనసభా పక్ష నేతగా

## విజయ్ ఎన్నిక

**- ప్రభుత్వం ఏర్పాటుపై సమావేశంలో చర్చ**

**- మెజార్టీ కోసం గవర్నర్‌ను 15 రోజులు గడువు కోరిన టివికె**

**- పొత్తు కోసం ఎవరినీ అడుకోబోమని స్పష్టీకరణ**



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై,మే 5 : తమిళనాడులో అత్యధిక స్థానాలు సాధించిన టీవీకే పార్టీ మెజారిటీకి కొద్ది దూరంలో ఉంది. ఇదే సమయంలో పార్టీ లెజిస్లేటివ్ లీడర్‌గా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ ప్రకటించింది. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటుపై కూడా చర్చించారు. ప్రభుత్వ ఏర్పాటుకు కొన్ని సీట్లు తక్కువగా ఉన్న అంశాన్ని నేతలు ప్రస్తావించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు

11 లో

## ఇచ్చిన హామీలకు...పాలనకు పొంతన లేదు

**- కాంగ్రెస్ సర్కార్‌ను సాగనంపడమే ఉత్తమం**

**- గజ్వేల్ బిజెపి సభలో ఈటెల రాజేందర్ వ్యాఖ్య**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సిద్దిపేట, మే 5 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఆయన చేస్తున్న పనులకు ఎక్కడా పొంతన లేదని ప్రజలు చెప్పుకొనే పరిస్థితి వచ్చిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ఎన్ని శాపనార్థాలు పెట్టినా వేస్ట్ అని.. మళ్ళీ ఎన్నికలు వచ్చినప్పుడు ఓడిస్తే తప్ప మనకు మన:శాంతి లేదని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు.మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీజేపీ నేతల సమావేశంలో

11 లో

## ప్రధాని పర్యటనలో భారీ భద్రత

**- కట్టుదిట్టమైన భద్రతా చర్యలు**

**- అధికారులతో సమీక్షలో సిఎస్ ఆదేశం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 5 : ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మే 10వ తెలంగాణలో పర్యటిం చనున్న నేపథ్యంలో భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఆదేశించారు. అలాగే తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా పొరపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను ఆయన సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధానమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించ నున్నారు. దీంతో పాటు అదేరోజు

11 లో

బెంగాల్, అసోంలకు

## బిజెపి పరిశీలకుల నియామకం

**- అమిత్ షా, జెపి నడ్డాలకు పార్టీ బాధ్యతలు**



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 5 : పశ్చిమ బెంగాల్, అసోంలలో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో అక్కడ ప్రభుత్వాల ఏర్పాటుకు బిజెపి రంగం సిద్ధం చేసింది. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుంది. బెంగాల్ సీఎం ఎవరూ అనేదానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బీజేపీ అధిష్టానం

11 లో

## కాళేశ్వరంపై సిబిఐ విచారణ ఎందుకు చేయరు

**- బిఆర్ఎస్‌తో బిజెపి కుమ్మక్కు రాజకీయాలకు నిదర్శనం**

**- కేంద్రమంత్రులు బండి, కిషన్ రెడ్డిలు సమాధానం చెప్పాలి**

**- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 5 : కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతిపై సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతుందో సమాధానం చెప్పాలని తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనున్నారని.. ఆ లోపు దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాళేశ్వరం

11 లో

ఏరోస్పేస్ దిగ్గజాలకు

## తెలంగాణ వ్యూహాత్మక భాగస్వామి

**- డ్రోన్ టెక్నాలజీ, శాటిలైట్ కమ్యూనికేషన్స్ లోనూ గ్లోబల్ లీడర్**

**- ఎకోసిస్టమ్, ఇన్నోవేషన్, ఆర్ అండ్ డీ, ఇండస్ట్రీ రెడీ వర్క్‌ఫోర్స్ పైదృష్టి**

**- 'ఐటీపీ ఏరో-ఇండియా' ప్లాంట్‌కు మంత్రి శ్రీధర్ బాబు భూమిపూజ**







(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 5 : అంతర్జాతీయ ఏరోస్పేస్ దిగ్గజాలకు తెలంగాణను ఒక వ్యూహాత్మక భాగస్వామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రాన్ని కేవలం విడిభాగాల తయారీకే పరిమితం చేయకుండా.... గ్లోబల్ ఏరోస్పేస్ ఆర్ అండ్ డీ హబ్‌గా మార్చేందుకు అవసరమైన 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు.

11 లో

## కాళేశ్వరం అవినీతిపై చర్యలేవీ

**- కెసిఆర్‌ను అరెస్ట్ చేసే దమ్ము లేదా**

**- కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 5 : సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము రేవంత్ రెడ్డికి లేదా అని ప్రశ్నించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. విద్యుత్ కొనుగోళ్ల అవినీతిపై రేవంత్ మళ్లీ వెనకడుగు వేస్తున్నారని విమర్శించారు. 'కేసీఆర్‌తో బేరం కుదరలేదా. ఢిల్లీకి మూటలు సరిగా ముట్టడం లేదా. అన్ని కేసులను సీబీఐకి ఎందుకు అప్పగిస్తారు' అంటూ మండిపడ్డారు. రైతులు

11 లో

## హైదరాబాద్‌లో బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్

**- తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందం**

**- సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు**

**- ఐటీ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 5 : హైదరాబాద్‌లో జర్మనీకి చెందిన అంతర్జాతీయ దిగ్గజం బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వానికి కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు సంస్థ ప్రతినిధులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించనున్నట్లు ప్రకటించారు. ఈ హబ్ ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్ సేవలకు వ్యూహాత్మక కేంద్రంగా పని చేయనుంది. గ్లోబల్ సర్వీస్ డెలివరీ నెట్‌వర్క్‌కు హైదరాబాద్ కీలక కేంద్రంగా మారనుంది. 160 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అంతర్జాతీయ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి ద్వారా తన సేవలను మరింత విస్తరించనుంది. తెలంగాణలో మరో మెగా గ్లోబల్ కంపెనీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడంపై ప్రభుత్వం సంతోషం వ్యక్తం చేసింది. హైదరాబాద్‌పై అంతర్జాతీయ కంపెనీల నమ్మకం మరింత పెరుగుతోందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

11 లో

# ఇందిరమ్మ ఇండ్లలో నాణ్యత తప్పనిసరి - ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

## - చర్ల పర్యటనలో కలెక్టర్ అంకిత్ ఆదేశాలు- ధాన్యం కేంద్రం, గృహ నిర్మాణాలు, ఆరోగ్య కేంద్రంపై ఆకస్మిక తనిఖీలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 5 : చర్ల మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృత పర్యటన నిర్వహించి ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సత్యనారాయణపురం గ్రామంలోని పెద్దపల్లి--ముమ్మిడివరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఇప్పటివరకు వచ్చిన ధాన్యం పరిమాణం, కొనుగోలు పురోగతిని తెలుసుకున్నారు. రైతులకు అందిస్తున్న టార్పాలిన్లు, హమాలీలు, తాగునీరు వంటి సౌకర్యాలను పరిశీలించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం నష్టపోకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, లోడింగ్ వేగవంతం చేయడానికి సరిపడా లారీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీలను ఆలస్యం లేకుండా నమోదు చేయాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్, పునాది నుంచి స్లాబ్ వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. సిమెంట్, ఇసుక, ఇనుము వంటి నిర్మాణ సామగ్రి నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామంలో మంజూరైన 27 ఇళ్లలో 25 ఇళ్లు వివిధ దశల్లో ఉండగా, మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వం పేదలకు నాణ్యమైన గృహ వసతి కల్పించడమే లక్ష్యమని, పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, మెటర్నిటీ వార్డు, డయాలసిస్ కేంద్రం, మందుల నిల్వ గది, వంటగది, అవుట్ పేషెంట్ విభాగం తదితరాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను



తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా స్టాక్ నిర్వహణను క్రమబద్ధీకరించాలని, రోగులకు శుభ్రతతో కూడిన పోషకాహారం అందించాలని ఆదేశించారు. అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్ అత్యవసర సేవల్లో సమయపాలన పాటిస్తూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో తాగునీటి సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఈదయ్య, గృహ నిర్మాణ శాఖ ఏఈ ముకేశ్, ఏఓ లావణ్య, మిషన్ భగీరథ ఏఈలు అరుణ్, రాము, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సాయి వర్ధన్, డాక్టర్లు రాంప్రసాద్, రవికుమార్, తిరుపతిరావు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక సప్లమెంటరీ క్యాంపులు

## - 100% ఉత్తీర్ణత లక్ష్యంగా చర్యలు: కలెక్టర్ అంకిత్

## - ఇంటర్, పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి - మౌలిక వసతులపై కూడా సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 5 : భద్రాద్రి జిల్లాలో ఇంటర్మీడియట్, పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ప్రత్యేక సప్లమెంటరీ క్యాంపులను సమర్థవంతంగా నిర్వహించి 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలను సేకరించి, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భద్రాచలం, పాల్వంచ, చంద్రుగొండ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సప్లమెంటరీ క్యాంపుల్లో విద్యార్థుల హాజరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరవ్వేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 13 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, లక్ష్యబద్ధంగా బోధన కొనసాగించాలని సూచించారు. అలాగే పదోతరగతి ఫెయిల్ విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంపులు నిర్వహించి, మండలాలు మరియు పాఠశాలల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని చెప్పారు. ఈ క్యాంపుల ద్వారా విద్యార్థుల లోపాలను గుర్తించి, ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లాలోని పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, పాఠశాలల పునఃప్రారంభానికి ముందే అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.



ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుదీకరణ వంటి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 12 నుంచి విద్యాశాఖ చేపట్టనున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంచి, ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపరచేందుకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.



# కాలిపోయిన మొక్కజొన్న జొన్న పొలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా

## - అగ్ని ప్రమాదానికి గల కారణాలను రైతులతో చర్చ - ట్రాన్స్ఫార్మర్‌ను పరిశీలన... వేలాడుతున్న విద్యుత్ తీగల చూసి అసహనం

## - రైతులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ - ఆదుకోండి అంటూ మహిళా రైతుల ఆవేదన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, మే 5 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామంలో అగ్ని ప్రమాదం వల్ల నష్టపోయిన రైతుల పొలాలను మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. కాలినడకన దాదాపు 6 కిలోమీటర్లు నడిచి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు అయితే 48 లక్షల రూపాయల మేరకు 29 మంది రైతులకు సంబంధించిన పంటలు కాలిపోయినట్టు రికార్డులు చెపుతున్నాయన్నారు అగ్ని ప్రమాదం జరిగిన సందర్భంలో ఉన్న రైతులను వివరాల అడిగి తెలుసుకున్నారు. మరోవైపు స్థానిక తాసిల్దార్ సుభాష్ చంద్రకు పూర్తి వివరాలు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలుసుకొని తగు నివేదిక పంపించాలని కోరారు. అంతేగాక కలెక్టర్ వెళుతున్న పంట పొలాలలో విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండడం గమనించి ఈ విధంగా ఎందుకు ఉన్నాయంటూ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు అయితే ఈ విషయంలో సంబంధిత మండల విద్యుత్ శాఖ అధికారికి వివరించిన ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. విద్యుత్తు స్తంభాల కోసం నాలుగు సంవత్సరాల క్రితం డీడీలు కట్టిన ఇప్పటివరకు స్తంభాలు ఇవ్వడం లేదని రైతులు తెలిపారు అయితే ఏదైనా సమస్య ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురండి పాత డీడీలు ఉంటే ఆ వివరాలు నాకు పంపించండి అంటూ తెలిపారు అంతేగాక గ్రామ మాజీ ఎంపీటీసీ ఆకుల రాజేందర్ విద్యుత్తు సమస్యలను వివరిస్తుండగా మీరు ప్రతి విషయాన్ని వ్యక్తిగతంగా విద్యుత్ శాఖ విషయంలో ఇబ్బందులు పడుతున్న వివరాలను తీసుకొచ్చి నేరుగా ఇవ్వాలని పేర్కొన్నారు. జరిగిన నష్టం విషయమై ప్రభుత్వానికి నివేదిస్తామని నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక అన్ని ప్రమాదంలో పైపులు కాలిపోయాయని కొంతమంది రైతులు తెలపడంతో హార్టికల్చర్ ద్వారా ఇప్పించే ప్రయత్నం చేస్తామన్నారు. కలెక్టర్ పంట పొలాలను పరిశీలించి తిరిగి వస్తున్న సమయంలో మహిళా రైతులు ఎదురుపడి కలెక్టర్ ముందు కన్నీటి పర్వతమయ్యారు కలెక్టర్ బాధపడకండి అమ్మ విషయం అంతా గమనించాను మీకు న్యాయం జరిగేలా చూస్తానంటూ విషయం అంత పైస్థాయి అధికారులకు ప్రభుత్వానికి నివేదిస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ చిత్రు. ఆర్డిఓ విద్యాసాగర్ రావు తాసిల్దార్ సుభాష్ చంద్ర. విద్యుత్ శాఖ అధికారులు ఏడి లక్ష్మణ్ ఏఈ శ్రావణ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# బాసర ఐఐఐటిలో విద్యార్థులకు నైపుణ్యాత్మక విద్యా బోధన అందించాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 5 : బాసర ఐఐఐటీలో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ ఐఐఐటి క్యాంపస్‌ను సందర్శించి, యూనివర్సిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి సంబంధించిన విభాగాలు, మొత్తం విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న విద్యా విధానం, అధ్యాపకుల వివరాలు, వసతి సౌకర్యాలు, సదుపాయాలు, విద్యార్థులు సాధించిన విజయాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, క్యాంపస్ విద్యార్థులను ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా బోధనలో ఆధునిక, సులభతర పద్ధతులను అనుసరిస్తూ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా బోధన సాగించాలని తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులందరికీ ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలు



కల్పిస్తూ, ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యను అందించాలని పేర్కొన్నారు. నాణ్యమైన ఆహారం, సురక్షితమైన త్రాగునీరు అందించాలని ఆదేశించారు. యూనివర్సిటీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం యూనివర్సిటీ అధికారులు జిల్లా కలెక్టర్ ను, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌లను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. వర్సిటీ ఉపకులపతి గోవర్ధన్, డిఆర్డిఓ విజయలక్ష్మి, తహసీల్దార్ పవన్ చంద్ర, యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అయిల్ ఫామ్ పంటతో అధిక లాభాలు

## - పంట మార్పిడి చేస్తూ నూతన వంగడాలపై దృష్టి పెట్టాలి - ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 5 : ముధోల్ నియోజకవర్గం రైతులు అయిల్ ఫామ్ పంటను వేసి అధిక లాభాలు సాధించాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు.మంగళవారం భైంసా లోని శ్రీ బంకెట్ హాల్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అయిల్ ఫామ్ పంట వేయాలని రైతులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీని సద్వినియోగం చేసుకొని పంట వేయాల్సిందిగా సూచించారు.. నియోజకవర్గం లో ప్రస్తుతం 4200 ఎకరాల్లో రైతులు పంటను వేయడం జరిగిందన్నారు. పంట వేసినప్పటినుండి మూడు సంవత్సరాల వరకు అంతర పంటలు వేసుకోవచ్చాన్నారు. 20 వేల ఎకరాల వరకు వరకు పంట వేస్తె భవిష్యత్తు లో మన ప్రాంతం లో అయిల్ ఫామ్ ఇండస్ట్రీ వచ్చే అవకాశం ఉందన్నారు.. ఉ పాధి హామీ పథకం లో రైతుల కోసం ఎన్నో స్కీమ్ లు ఉన్నాయని వాటిని వివరించాల్సిన బాధ్యత అధికారుల పై ఉందన్నారు. పంట మార్పిడి తో రైతులు లాభాల బాట పడతారని ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని,రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడితే ప్రజల ఆరోగ్యాలకు ప్రమాదకరమన్నారు... అనంతరం కార్యక్రమం లో ఉత్తమ రైతులను సన్మానించారు.. అధికారులు అయిల్ ఫామ్ పంట పై ప్రెజెంటేషన్ ఇచ్చి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ బాలు నాయక్, ఎడిఏ లు వీణ శ్రీనివాస్ రాజు, ఉద్యానవన శాఖ అధికారి జావీద్ పాషా, వ్యవసాయ శాఖ అధికారులు,, పలువురు సర్పంచ్ లు రైతులు పాల్గొన్నారు..



# సర్వీస్ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 05 : రామగుండం ఎన్టీపీసీ సర్వీస్ రోడ్డును రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్. రాజ్ ఠాకూర్ మంగళవారం పరిశీలించారు. సర్వీస్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే రోడ్డుకు మధ్యలో, ప్రయాణీకులు, వాహనదారులకు ప్రమాదకరంగా ఉన్న కరెంటు పోల్స్‌ను వెంటనే రోడ్డు ప్రక్కకు మార్చాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, రహదారి పనులు నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఆయన వెంట పలువురు కార్పోరేటర్లు, నాయకులు తదితరులున్నారు.



# ఆసిఫాబాద్ జిల్లాకు అరుదైన అవకాశం

## - పేటెంట్ కార్యాలయం నుండి అధికారిక నమోదు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 5 : కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు గర్వకారణమైన ఘనత దక్కింది. రద్దీ ప్రదేశాలలో పార్కింగ్ సమస్యలకు వినూత్న పరిష్కారం చూపించే Parking Management in Crowded Places అనే డిజైన్‌కు భారత ప్రభుత్వం పేటెంట్ కార్యాలయం నుండి అధికారిక నమోదు లభించింది. ఈ డిజైన్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ నంబర్ 486267-001 కాగా, ఇది 5 జనవరి 2026న నమోదు చేయబ డింది. ఈ ఆవిష్కరణను మౌల్కారి కేశవ్, అల్సా మమత, కటుకం మధుకర్ కలిసి రూపొందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.హరిత విద్యార్థిని, సహకరించిన ఉపాధ్యాయులు కేశవ్,జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి లలిత పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థి అల్స మమత జిల్లా కలెక్టర్ కోరిక మేరకు ప్రాజెక్ట్ గురించి వివరిస్తూ ఈ డిజైన్ నమోదు ద్వారా నగరాలలో పెరుగుతున్న ట్రాఫిక్ పార్కింగ్ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అందించే దిశగా ఒక ముఖ్యమైన అడుగు పడినట్టు అని తెలిపింది. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ నిర్వహణను సులభతరం చేయడంలో ఈ డిజైన్ ఉపయోగపడనుందని పేర్కొంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరిత మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులు యువతకు ఇది ఒక ప్రేరణగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల నుంచే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం విశేషమని తెలిపారు. అదేవిధముగా నో పార్కింగ్ ప్రదేశాలలో పార్కింగ్ చేస్తె అధికారులకు సమాచారము ఇచ్చే డివైస్ రూపొందించాలని సూచించారు.

# ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

## జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హెచ్.వెంకటేశ్వర రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, మే 5 : జిల్లాలో మే 13 నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హెచ్. వెంకటేశ్వర రావు ఆదేశిం చారు. మంగళవారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో పరీక్షల నిర్వహణపై సమగ్రంగా సమీక్షించారు. మే 13 నుండి 21 వరకు రెండు సెషన్లలో (ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకు) పరీక్షలు జరుగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,684 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, ఇందుకు 26 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల సందర్భంగా అన్ని కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 163 దీఛీూా సెక్షన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. పరీక్ష సమయాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో వైద్య సదుపాయాలుగా ఏ.ఎన్.ఎం. , ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచనున్నారు. విద్యార్థులు సమయానికి చేరుకునేలా టీజీఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుండగా, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం వంటి వసతులను కల్పించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. పరీక్షల పారదర్శకత కోసం ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించడంతో పాటు ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్లలో భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ జి. సత్యనారాయణ, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులు, వంట నిర్వాహకులకు ఫుడ్ సేఫ్టీ శిక్షణ ప్రారంభం

## - 'సర్వ్ సేఫ్ ఫుడ్' కార్యక్రమంలో 300 మందికి శిక్షణ లక్ష్యం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, మే 5 : పట్టణంలోని వీధి వ్యాపారులు, పాఠశాలల మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులకు సురక్షిత, నాణ్యమైన ఆహారం అందించే లక్ష్యంతో 'సర్వ్ సేఫ్ ఫుడ్' శిక్షణ కార్యక్రమం మంగళవారం భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రారంభమైంది. నాస్వి, నెస్లే ఇండియా, ఎఫ్ఎస్ఎస్ఏఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ టి. శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్‌పర్సన్ మంజుల జ్యోతి దీపప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహార తయారీలో వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, నాణ్యతా ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. జిల్లా ఆహార భద్రత నియమిత అధికారి పి. స్వాతి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఆనంద్ ఎన్. రావు, జిల్లా ఆహార భద్రతాధికారి ఎన్. శివశంకర్ రెడ్డి పాల్గొని ఆహార భద్రత చట్టాలు, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆహార పదార్థాల నిల్వ విధానం, వంటగది పరిశుభ్రత, సురక్షిత పంపిణీ పద్ధతులపై సూచనలు చేశారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ శిక్షణలో ప్రతిరోజూ 100 మంది చొప్పున మొత్తం 300 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలి రోజు 100 మంది వీధి వ్యాపారులు, మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులు పాల్గొన్నారు. శిక్షకుడు రాజ్‌కుమార్ వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార భద్రతపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. పాల్గొన్న వారికి హైజీన్ కిట్లు పంపిణీ చేసి, శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికేట్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా

**- నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం - హైదరాబాద్ తో పాటు స్థానిక కంపెనీల్లోను ప్రాధాన్యం కల్పిస్తాం - అధికారుల సమన్వయంతో - మెగా జాబ్ మేళా విజయవంతం - జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 05 : కరీంనగర్ జిల్లాలో ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. జిల్లా కేంద్రంతోపాటు ఇతర ప్రాంతాల్లో మూడు నెలలకోసారి జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. జాబ్ మేళా నిర్వహణ తీరుపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది హాజరయ్యారు!.. ఏ కంపెనీలో అవకాశం కల్పించారు? అని ఆరా తీశారు. వసతుల కల్పనపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు అందరూ సమన్వయంతో జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. రాబోయే రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని జాబ్ మేళాలను ఏర్పాటు చేద్దామని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో ఉద్యోగులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, వారి ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత భారీ సంఖ్యలో తరలివచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కలెక్టర్ నేతృత్వంలో వివిధ శాఖల అధికారుల సమన్వయంతో జాబ్ మేళాను అత్యంత పకడ్బందీగా నిర్వహించారు. హాజరైన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలర్లు, తాగునీటి వసతి కల్పించగా, టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేపట్టి అభ్యర్థులకు ఉపశమనం కల్పించారు. ఈ జాబ్ మేళాలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంపెనీలతో పాటు కరీంనగర్‌కు చెందిన స్థానిక కంపెనీలు కూడా పాల్గొన్నాయి. ఐటీ, నాన్-ఐటీ, హెల్త్‌కేర్, ఆర్గానిక్, డైరీ, అగ్రికల్చర్ తదితర రంగాలకు చెందిన సుమారు 90 కంపెనీలు నియామక ప్రక్రియను నిర్వహించాయి. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి దాదాపు 3 వేల మంది యువతీ యువకులు హాజరుకాగా, వారిలో 997 మంది వివిధ ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికయ్యారు. మరో 478 మందిని వివిధ కంపెనీలు తక్షణమే ఉద్యోగాలకు ఎంపిక చేయగా, త్వరలో వారికి నియామక పత్రాలు అందజేయనున్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం మొత్తం 95 స్టాల్స్ ఏర్పాటు చేయడమే కాకుండా, సందేహాలు నివృత్తి చేసేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో మెగా జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కే.మహేశ్వర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి తిరుపతిరావు, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, పరిశ్రమల శాఖ జీఎం సాల్మన్ రాజు, పీడీ మెప్మా స్వరూపరాణి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తదితర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



## బిజెపిలో చేరిన కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా జాయింట్ సెక్రెటరీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 05 : భారత ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో చేస్తున్నటువంటి అభివృద్ధిని,రాష్ట్రము లో,జిల్లా లో బిజెపి పార్టీకి ఆకర్షితులై,కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ జాయింట్ సెక్రెటరీ సూర్నేని రాము మంగళవారం మానుకోట జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణ్ నాయక్,మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరడం జరిగింది.సూర్నేని రాముని,రఘునందన్ బిజెపి కాండువ కప్పి పార్టీలో చేర్చుకోవడం జరిగింది.సూర్నేని రాముతో పాటు సుమారుగా 60 మంది వరకు పార్టీలో జాయిన్ అవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాధవనేని రఘునందన్ మాట్లాడుతూ తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వంమేనని, యువకులు, విద్యావంతులు, మేధావులు, రైతులు, ప్రజలందరూ కూడా బిజెపికి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని, దేశం కోసం మోడీ చేస్తున్న అభివృద్ధి పలాలు క్రింది స్థాయి వరకు చేరుతుందని ఈ సందర్భంగా చెప్పడం జరిగింది.సూర్నేని రాము మాట్లాడుతూ మానుకోట జిల్లాలో బీజేపీ పార్టీ అభివృద్ధి కోసం తన వంతుగా కష్టపడుతనని,బిజెపి పార్టీని గ్రామ గ్రామాన తీసుకెళ్లడానికి తన శాయశక్తుల కృషి చేస్తానని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీరా సీతారాం నాయక్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగాల సుధీర్ రెడ్డి,రామచంద్ర రావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్యాంసుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు గడ్డం అశోక్, చీకటి మహేష్, మదన్, ధార ఇందు భారతి, పద్మ, రేష్మ, 26వ వార్డు కౌన్సిలర్ మాలోతు శ్రీదేవి బాలునాయక్, చుక్కా శ్యాంప్రసాద్, అజ్మీర శ్రీకాంత్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ఆసక్తి కనబరచాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 05 : పట్టణంలోని గిరిజన భవన్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - రైతువారంలో భాగంగా మహబూబాబాద్ నియోజకవర్గ స్థాయి పంట మార్పిడి ద్వారా ఉద్యాన పంటల సాగు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదల, ప్రత్యామ్నాయ పంటల సాగు అవగాహన సదస్సును జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ, టీజీ ఆయిలఫెడ్, వ్యవసాయ శాఖ,సహకార శాఖ, మార్కెటింగ్ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన పరిశోధన స్థానం,ఉద్యాన కళాశాల, పశు సంవర్ధక శాఖ వారి సహకారంతో నిర్వహించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని, నిత్యం రోగనిరోధక శక్తికి, ఆరోగ్యంగా ఉండటానికి పోషకాలు అందించే పండ్ల తోటలు అయిన జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, సీతాఫలం, పనస, నేరేడు, అవకాడో, ఫ్యాషన్ ఫ్రూట్, కూరగాయలు, ఆకు కూరలు, మునగ, వెదురు మొదలైనవి సాగు చేయాలని తద్వారా ఎకరానికి లక్ష రూపాయలు నికర ఆదాయం పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రో ట్రే లో నారు పెంపకం, ఎత్తు మడులు,మల్చింగ్, బిందు సేద్యం,ఫర్టిగేషన్, వేప పిండి,ఆముదం పిండి వాడకం,వేప నూనె పిచికారి చేయటం,పసుపు రంగు అట్టల వాడకం,సిఫారసు చేసిన ఎరువులు వాడటం,పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన



పద్ధతులు పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ గుగులోతు జ్యోతి, వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మన్ కమిటీ మదన్ గోపాల్ లోయా,జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, జిల్లా వ్యవసాయ అధికారి బి. సరిత, జిల్లా సహకార అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.బోడె పూడి కిరణ్ కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ. శ్రీనివాస రావు, వార్డ్ కౌన్సిలర్ ఎస్. దిలీప్, ఆయిల్ పామ్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ వల్లూరి కృష్ణ రెడ్డి, ఆయిల్ పామ్ అభ్యుదయ రైతు డా. యానాల ఇంద్ర సేనా రెడ్డి,ఆయిల్ పామ్ అభ్యుదయ రైతు బొబ్బల యాకూబ్ రెడ్డి, ఆయిల్ పామ్ అభ్యుదయ రైతు మిట్టకంటి ఉపేందర్ రెడ్డి, మల్బరీ అభ్యుదయ రైతు వేం పార్థ సారధి రెడ్డి, ఉద్యాన అధికారి శాంతి ప్రియదర్శిని, వ్యవసాయ అధికారులు తిరుపతి రెడ్డి, అబ్దుల్ మాలిక్, రాజు, పలువురు ఆయిల్ ఫెడ్ విస్తరణ సిబ్బంది, వ్యవసాయ, ఉద్యాన విస్తరణ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

# ఈ కంపు భరించలేం...!

## ప్రధాన రోడ్డుపై మురుగునీటి వరదకు గ్రామస్తుల విలవిల...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేక్మాల్ మే05 : మెదక్ జిల్లా, టేక్మాల్ మండలం, ఎలకుర్తి, శేరిపల్లి గ్రామ ప్రధాన రహదారి మురుగు కాలువగా మారిపోయింది. మూసుకుపోయిన మురుగు కాలువ కారణంగా మురుగు నీరు రోడ్డుపై పొంగిపొర్లుతూ, గ్రామ ప్రజల జీవనాన్ని నరకయాతనగా మార్చింది. మురుగు నీరు... దుర్వాసనతో ఊపిరి పీల్చుకోవడమే కష్టమవుతోంది. "ఛీ... ఇది జీవించాల్సిన పరిస్థితినా?" అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఇదే దృశ్యం కొనసాగుతుండగా, పాలక వర్గం మాత్రం గట్టిగా కళ్లు మూసుకుని కూర్చుంది. ప్రధాన రహదారి మీదే మురుగు ప్రవహించడం వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు అనారోగ్య భయంతో బయటకు రావడానికి భయపడుతున్నారు. దోమలు, దుర్వాసనలతో గ్రామం మొత్తం ఆరోగ్య సమస్యల ముప్పులో పడింది. గ్రామ సభలో పలు సార్లు ఈ సమస్యపై తీర్మానాలు చేసినప్పటికీ, అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. వార్డు సభ్యులు పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు ఇచ్చినా, ఫలితం శూన్యం. సమస్య అలాగే ఉండిపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రెచ్చగొడుతోంది. "ఇంకా ఎంతకాలం ఈ మురుగులోనే బతకాలా? పన్నులు మాత్రం వసూలు చేస్తారు... సమస్యలు మాత్రం పట్టించుకోరా?" అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే మురుగు కాలువను శుభ్రపరిచి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# పోషక ఆహార లోపం నివారణే లక్ష్యం..

**- మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా పౌష్టికాహారం పంపిణీ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 5 : చిన్నారుల్లో పోషక ఆహార లోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించిందని ములుగు మున్సిపల్ చైర్మన్ చింతలిప్పుల చంద్రకళ బిక్షపతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ములుగు బ్యాంకు కాలనీ అంగన్వాడీ సెంటర్ లోని లబ్ధిదారులకు ములుగు మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి పౌష్టిక ఆహార పంపిణీ చేసి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలోని చిన్నారులకు అందిస్తున్న పౌష్టిక ఆహారం గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అందుతున్న సేవలు,అంగన్వాడి కేంద్రంలోని మౌలిక సదు పాయాల పరిస్థితిని కౌన్సిలర్ల తోపాటు మున్సిపల్ చైర్మన్ స్వయంగా పరిశీలించారు.అంగన్వాడి కేంద్రాలకు వేసవిసెలవుల్లో కూడా పోషక విలువలను అందిం చడానికి నెలకు సరిపడే సరుకులు బియ్యం,పప్పు, నూనె, పాలు,గుడ్లు,నెల రోజులకు సరిపోను గర్భిణీలు, బాలింతలు చిన్నారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నల్లెల్ల స్వాతి,గుంటోజు పావని, కుత్బుద్దిన్, బైక్ కానీ సునీత, ఓం ప్రకాష్, బ్యాంక్ కాలనీ అంగన్వాడి టీచర్,గర్భిణీ స్త్రీలు బాలింతలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అందరు సహకరించాలి

**- దుకాణాల ముందు రోడ్లపై వాహనాలు నిలుపరాడని సూచన**

**- ట్రాఫిక్ సమస్యలపై వ్యాపారులకు అవగాహన**

**- ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత**

**- అదనపు ఎస్పీ రాజేష్ మీనా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే, 5 : వనపర్తి జిల్లాలో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా బ్లూసి హోటల్ ముందు వాహనాలు రోడ్డు మీద పార్కింగ్, షాపులు బోర్డులు పెట్టి ఆక్రమణలు చేసి రాకపోకలకు అంతరాయం కలుగజేస్తున్న షాపుల యాజనులకు, వాహనదారులకు అదనపు ఎస్పీ శ్రీ లిరాజేష్ రాజేష్ మీనా, ఐపీఎస్., వనపర్తి డిఎస్పీ, గిరిబాబు తో కలిసి అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... రోడ్డు అందరి సొత్తుఒక్కరి సౌలభ్యం కోసం ఇతరులకు ఇబ్బంది కలిగించరాదు. షాపుల ముందు వస్తువులు పెట్టడం, రోడ్డు ఆక్రమించడం వల్ల ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు పెరుగుతాయి అనవసర పార్కింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ వంటి తప్పులు ప్రమాదాలకు దారితీస్తాయి. పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వాలి వారు కూడా సురక్షితంగా ప్రయాణించాలని ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారికి చట్టపరమైన చర్యలు తప్పవని. ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు కలిసి సహకరిస్తేనే ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యం. భద్రతే లక్ష్యం నియమాలే రక్షణ" అనే భావనతో ముందుకు సాగాలని. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా తిరిగేవారిపై కఠిన తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, ట్రాఫిక్ ఆర్ఎస్సై, సురేందర్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 05 : బాల్యంలో వివాహం అనర్థాలకు మూలం అని జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ అన్నారు. మంగళవారం గూడూరు మండలం అయోధ్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఏర్పాటు చేసిన ఆశా డే కార్యక్రమానికి ముఖ్య అతిదిగా పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలో వివాహానికి సరైన వయసు అమ్మాయిలకు 18 సంవత్సరాలు,అబ్బాయిలకు 21 సంవత్సరాలు అని బాల్య వివాహాలను నివారించడానికి,లింగ సమానతను ప్రోత్సహించడానికి వీలు గా ఉంటుందని, సరైన వయసులో వివాహానికి అనేక లాభాలు వున్నాయని ముఖ్యంగా చిన్నపిల్లల వివాహాలను నిషేధించడం ద్వారా,చట్టం ద్వారా మౌలిక హక్కులను గుర్తిస్తుందని, బాల్య వివాహాల వల్ల వచ్చే శారీరక, భావోద్వేగ, మానసిక ఒత్తిడిలను నివారిస్తుందని ఆయన తెలిపారు. వివాహ వయసును ఆలస్యం చేయడం వలన అమ్మాయి శారీరక ద్రుడత్వం పెరిగి సరైన వయస్సు లో గర్భ దారణ పొందవచ్చని, తన విద్యను కొనసాగించడానికి, వ్యక్తిగత వృత్తిపరమైన అభివృద్ధికి కొంత మౌలిక నైపుణ్యాలను పొందడానికి అవకాశం ఇస్తుందని,ఇది వారిని శక్తివంతులుగా మార్చుతుందని అది సమాజానికి తోడ్పడుతుం దని,బాల్య వివాహాలు అమ్మాయిలకు ప్రతికూల ఆరోగ్యాన్ని కలిగిస్తాయని,మాతృ మరణ రేట్లు పెరగడం,బాల్య గర్భధారణలను తగ్గించడం ద్వారా,మెరుగైన ఆరోగ్య ఫలితాలను ప్రోత్సహిస్తుందని సరైన వయసులో పెళ్లి చేసుకుంటే, అమ్మాయి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుందని, సంబంధాలను అర్థం చేసుకుని బాధ్యతగా ముందుకు సాగుతుందని, జీవిత భాగస్వామిని ఎంచుకోవడంలో జీవిత నిర్ణయాలలో స్పష్టత ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆరోగ్య విద్యా బోదకుడు పురుషోత్తమ్, ఎంపిహెచ్ఈఓలు, కేఎల్ఎన్ స్వామి, గోపిచంద్, పిహెచ్ఎన్ మేరి, సుపెర్వైజర్స్ ఫహీముద్దీన్, గణేశ్, హేమలత, ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి


**- మిషన్ భగీరథలో అంతరాయం కలిగితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**- కలెక్టరేట్‌లో త్రాగునీటి సరఫరాపై సమీక్ష**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 05 : వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం సమగ్ర జిల్లా కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరా, వేసవి యాక్షన్ ప్లాన్‌పై కలెక్టర్ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాలో ఎక్కడైనా అంతరాయం కలిగితే వెంటనే స్థానిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు నీటి కొరతతో ఒత్తిడికి గురికాకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త గృహ కనెక్షన్లను గ్రామ పంచాయతీ నిధుల ద్వారా వేగంగా మంజూరు చేయాలని తెలిపారు. పైప్‌లైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేసి నీటి వృథా నివారించాలన్నారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల చిన్నపాటి మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ హౌసింగ్ పథకం పురోగతిని వేగవంతం చేయాలని, లబ్ధిదారులందరిని సంప్రదించి గృహ నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని తెలిపారు. నిర్మాణ పురోగతినిబట్టి బిల్లులు చెల్లించడంతో పాటు అవసరమైన నమోదు వివరాలను సమయానుసారం నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ పూర్ణ చందర్, ఇంట్రా ఈఈ శ్రీనివాస్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపీడీవోలు, తదితర అధికారులు పాల్గొన్నారు.




# ఎంచుకున్న రంగంలో ఎదిగేందుకు నైపుణ్యం పెంపొందించుకోవాలి

## అదనపు కలెక్టర్ అరుణశ్రీ


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 05 : మహిళలు తాము ఎంచుకున్న రంగంలో ఎదిగేందుకు ఆ రంగంలో వస్తున్న మార్పు లను ఎప్పటికప్పుడు గమనిస్తూ తమ నైపుణ్యాశీ పెంపొందించుకోవాలని అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ అన్నారు. విద్యార్థుల యూనిఫామ్ కుట్టడంలో నైపుణ్యం పెంపొందించడానికి మెప్మా, ఎపి ప్రొడక్టివిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో జమ్మికుంటలో నిర్వహించిన శిక్షణా కేంద్రంలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది స్వశక్తి మహిళలకు రామగుండం నగరపాలక సంస్థ కార్యాల యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టైలరింగ్ వృత్తిలో ఉన్న మహిళలను గుర్తించి వృత్తి నైపుణ్యం మెరుగుపరచడానికి ఈ శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు యూనిఫామ్ కుట్టడానికి ఆర్డర్ ఇవ్వడంలో ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అర్హత ఉన్న స్వశక్తి మహిళలు వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడానికి అవసరమైన సహకారం మెప్మా ఆధ్వర్యంలో ఉచితంగా అంది స్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రామగుండం నగరపాలక సంస్థ సెక్రటరీ మహేశ్వర్ రెడ్డి, మెప్మా టిఎంసి మౌనిక, సిఓల తో పాటు ఎపి ప్రొడక్టివిటీ కౌన్సిల్ కో ఆర్డినేటర్ శరత్ కుమార్ పాల్గొన్నారు.

# పోలీస్,స్త్రీ శిశు సంక్షేమ శాఖలో పూర్తయిన స్వీయ గణన

## అదనపు జనాభా గణన అధికారి అనిల్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 05 : జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు జిల్లాలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రభుత్వ,కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్, తదితర అన్ని విభాగాలలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ స్వీయ గణన కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలో స్త్రీ శిశు సంక్షేమ శాఖలోని 6 విభాగాలు,ఐసిపిఎస్, సిహెచ్ఎల్,సఖి, పోషణ్ అభియాన్,హబ్ ఉమెన్ సేఫ్టీ విభాగం, 200 మంది,వారి సిబ్బంది సుమారు 1500 మంది ఆన్లైన్ లో వివరాలు నమోదు చేసుకున్నారు, డిఎస్పి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆన్లైన్ ద్వారా పోలీస్ అధికారులు,జిల్లాలోని పోలీస్ విభాగం లలో పనిచేస్తున్న సిబ్బంది ఉద్యోగులు మంగళవారం స్వీయ గణన కార్యక్రమంలో తమ వివరాలను నమోదు చేసుకొని ఐడి పొందారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ స్వీయ గణన కార్యక్రమంలో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.ఈ స్వీయ గణన కార్యక్రమంలో ఆన్లైన్ ద్వారా డీఎస్పీ తిరుపతిరావు,ముఖ్య ప్రణాళిక అధికారి వల్లూరీ శ్రీనివాసరావు, వెల్ఫర్ అధికారిని సబిత, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, సిడిపిఓలు శిరీష రాజ్యలక్ష్మి ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ద్రవిడ గడ్డపై నవ సంచలనం..

## బెంగాల్ కోటలో కమల కేతనం : 2026 ఎన్నికల అంతరార్థం

## 2026 ఎన్నికల సునామీ : కుప్పకూలిన పాత కోటలు... ఆవిర్భవించిన కొత్త శక్తులు!

## బహుముఖ పోరు... అద్భుత తీర్పు : భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చిన 'పంచ' రాష్ట్రాలు!



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494




భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో 2026 నాటి పంచ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు కేవలం ఒక సాధారణ అధి కార మార్పిడి ఘట్టాలుగా కాకుండా, దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూ లంగా మార్చివేసిన చారిత్రక పరిణా మాలుగా విశ్లేషించ బడుతున్నాయి. అస్సాం బ్రహ్మపుత్ర తీరం నుండి బెం గాల్ గంగమ్మ ఒడి వరకు, కేరళ కొబ్బ రి తోటల నుండి తమిళనాడు ద్రవిడ కోటల వరకు విస్తరించిన ఈ ఎన్నికల పోరులో భారతీయ ఓటరు తన పరిణ తిని చాటుకున్నాడు. దశాబ్దాల రాజకీయ ఆధిపత్యాలను సవాలు చేస్తూ, సరికొత్త శక్తులకు పట్టం కడుతూ, అభివృద్ధి మరియు సిద్ధాంతాల మేళవింపుతో వెలువడిన ఈ ఫలితాలు జాతీయ రాజకీయాల్లో నవ శకానికి నాంది పలికాయి. ముఖ్యంగా ఈ ఎన్నికల ఫలితాలు జాతీయ పార్టీల విస్తృతిని, ప్రాంతీయ సమీకరణాల మార్పును మరియు యువత రాజకీయ ఆకాంక్షలను స్పష్టంగా ప్రతిబింబించాయి.

ఉత్తర తూర్పు భారతావనిలో వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన అస్సాం రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (NDA) సాధించిన విజయం ఒక అప్రతిహత రాజకీయ ప్రస్థానానికి నిదర్శనంగా నిలిచింది. 126 స్థానాలు కలిగిన అస్సాం అసెంబ్లీలో ఎన్డీఏ ఏకంగా 102 స్థానాలను కైవసం చేసు కోవడం, ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమిని కేవలం 21 స్థానాలకే పరిమితం చేయడం ఒక చారిత్రక రికార్డు. 2016లో మొదటిసారి అధికారంలోకి వచ్చిన నాటి నుండి, 2021లో పట్టు నిలుపుకుని, ఇప్పుడు 2026లో వరుసగా మూడవసారి అఖండ మెజారిటీతో హ్యాట్రిక్ సాధించడం ద్వారా భాజపా ఈశాన్య భారతంలో తన అజేయ శక్తిని చాటుకుంది. ఈ అద్భుత విజయానికి ప్రధాన కారణం ప్రభుత్వం అమలు చేసిన సమగ్ర అభివృద్ధి నమూనా. మారుమూల ప్రాంతాలను అనుసంధానిస్తూ నిర్మించిన భారీ వంతెనలు, రహదారులు, మరియు మౌలిక సదుపా యాల కల్పన అస్సాం ప్రజల్లో అభివృద్ధిపై గట్టి నమ్మకాన్ని కలిగించింది. దీనికి తోడు, అక్రమ వలసల విషయంలో ప్రభుత్వం అవలంబించిన కఠిన వైఖరి, జాతీయ పౌర పట్టిక (NRC) అమలుపై ఉన్న స్పష్టత, మరియు స్థానిక సంస్కృతిని కాపాడే ప్రయత్నాలు గిరిజన మరియు స్థానిక వర్గాలను భాజపా వైపు మొగ్గు చూపేలా చేశాయి. కాంగ్రెస్ పార్టీ బలమైన నాయకత్వం లేక, క్షేత్రస్థాయిలో ఉనికిని కోల్పోవడం కూడా ఎన్డీఏకు ఇంతటి భారీ మెజారిటీ రావడానికి మార్గాన్ని సుగమం చేసింది.

దేశవ్యాప్త రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేసిన పరిణామం పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకుంది. గత దశాబ్ద కాలానికి పైగా బెంగాల్ గడ్డపై ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ కోటను కూల్చివేస్తూ భాజపా సాధించిన విజయం జాతీయ రాజకీయాల్లోనే అత్యంత కీలక మలుపు. 293 స్థానాలు కలిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో భాజపా 206 స్థానాలతో అఖండ విజయాన్ని నమోదు చేసి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. గతంలో ఎదురులేని శక్తిగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కేవలం 81 స్థానాలకే పరిమితం కాగా, కాంగ్రెస్ పార్టీ నామమాత్రం గా 2 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రాజకీయ హింస, అవినీతి ఆరోపణలు, మరియు పాల నాపరమైన అసంతృప్తి బెంగాల్ ఓటర్లలో ఒక నిశ్శబ్ద విప్లవానికి దారితీశాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లడంలో భాజపా విజయం సాధిం చింది. సామాజిక సమీకరణా లను తమకు అనుకూలంగా మార్చుకోవడమే కాకుండా, పరిపాల నలో మార్పు రావాలని కోరుకున్న యువత మరియు మధ్యతరగతి ఓటర్లు భాజపాకు బాసటగా నిలిచారు. ఈ విజయం ద్వారా దేశంలో 21 రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ఏకైక పార్టీగా భాజపా తన ప్రాబల్యాన్ని మరింత పటిష్టం చేసుకుంది.

దక్షిణ భారత రాజకీయాలలో సుదీర్ఘ కాలంగా 'మార్పు'కు వేదికగా నిలిచే కేరళ రాష్ట్రం ఈసారి కూడా తన సాంప్రదాయాన్ని కొనసాగించింది. గత ఎన్నికల్లో సాంప్రదాయక పద్ధతిని పక్కన పెట్టి వరుసగా రెండోసారి ఎల్డీఎఫ్‌కు పట్టం కట్టిన కేరళ ప్రజలు, ఈసారి తిరిగి యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఖణఖీ)ను అధికార పీఠంపై కూర్చోబెట్టారు. 140 స్థానాల కేరళ అసెంబ్లీలో యూడిఎఫ్ 102 స్థానాలను కైవసం చేసుకుని తన సత్తా చాటగా, అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ కేవలం 35 స్థానాలకు పడిపోయింది. ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో లోపాలు, నిరుద్యోగ సమస్య, మరియు విదేశీ పెట్టుబడుల కొరత వామపక్ష కూటమి పతనానికి కారణమయ్యాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ ప్రచారంలో చూపిన సమన్వ యం, యువ ఓటర్లను ఆకట్టుకునేలా రూపొందించిన ప్రణాళికలు ప్రజల్లో మార్పు పట్ల ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా విద్యావంతు లైన కేరళ ఓటర్లు పరిపాలనలో నూతన జవజీవాలు రావాలని కోరుకుంటూ యూడిఎఫ్‌కు స్పష్టమైన తీర్పునిచ్చారు.

భారత రాజకీయ యవనికపై 2026 ఎన్నికల్లో అత్యంత సంచలనాత్మక మలుపు తమిళనాడులో వెలువడింది. దశాబ్దాలుగా ద్రవిడ మున్నేట్ర కజగం (ఞవీఖ) మరియు అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (AIADMK)ల మధ్యే సాగుతున్న తమిళ రాజకీయాల్లోకి మూడవ శక్తిగా సినీ నటుడు విజయ్ ప్రవేశించడం, ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కళగం టీవికె పార్టీ అపూర్వ విజయాన్ని సాధించడం ఒక అద్భుతం. 234 స్థానాల తమిళనాడు అసెంబ్లీలో విజయ్ పార్టీ 108 స్థానాలను గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. దశాబ్దాల చరిత్ర కలిగిన డీఎంకే 73 స్థానాలకు, ఏఐఏడీఎంకే 53 స్థానాలకు పరిమితమయ్యాయి. ఇది కేవలం ఒక నటుడి గ్లామర్ విజయం మాత్రమే కాదు, ద్రవిడ రాజకీయాల పేరుతో సాగుతున్న అవినీతి, వారసత్వ రాజకీయా లపై తమిళ ప్రజల ఆగ్రహానికి నిదర్శనం. యువతలో ఉన్న విపరీతమైన ఆదరణను విజయ్ తన రాజకీయ సిద్ధాంతాలతో మేళవించి, క్షేత్రస్థాయిలో బలమైన పునాదిని నిర్మించు కున్నారు. పారదర్శక పాలన, కులాలకు అతీతమైన రాజకీయం, మరియు తమిళ అస్తిత్వాన్ని కాపాడుతూనే ఆధునిక అభివృద్ధిని కాంక్షించే ఆయన విధానం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ఇది భవిష్యత్తులో తమిళ నాడులో ద్విధ్రువ రాజకీయాలకు స్వస్తి పలికి, సరికొత్త రాజకీయ ప్రత్యామ్నాయాలకు మార్గం చూపింది.

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో సైతం ఓటరు తీర్పు అభివృద్ధికి అనుకూలంగా వెలువడింది. 30 స్థానాలు కలిగిన పుదుచ్చేరి అసెంబ్లీలో ఎన్డీఏ కూటమి 18 స్థానాలను సాధించి తన అధికారాన్ని నిలబెట్టుకోగా, కాంగ్రెస్ పార్టీ 6 స్థానాలకే పరిమితమైంది. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం ఉంటేనే చిన్న రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని పుదుచ్చేరి ప్రజలు భావించారు. పర్యాటక రంగం, మౌలిక వసతుల కల్పనలో వచ్చిన మార్పులు ఓటర్లను ఆకర్షించాయి. స్థానిక నాయకత్వం మరియు కేంద్రం మధ్య ఉన్న అవగాహన పుదుచ్చేరిలో రాజకీయ స్థిరత్వాన్ని కలిగించింది.

ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను సమగ్రంగా పరిశీలిస్తే భారత రాజకీయాల్లో కొన్ని కీలక ధోరణులు స్పష్టమవు తున్నాయి. మొదటిది, ప్రజలు ఇప్పుడు కేవలం సిద్ధాంతాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఫలితాలను ఇచ్చే 'నిష్పాక్షిక అభివృద్ధి' వైపు మొగ్గు చూపుతున్నారు. అస్సాం మరియు బెంగాల్ ఫలితాలు దీనికి నిదర్శనం. రెండవది, యువ ఓటర్ల పాత్ర గతంలో కంటే నిర్ణయాత్మకంగా మారింది. తమిళనాడులో విజయ్ పార్టీ సాధించిన విజయం, యువత ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఎంత ఆకలితో ఉన్నారో తెలియజేస్తోంది. మూడవది, సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న పార్టీలపై ఉన్న వ్యతిరేకత క్షేత్ర స్థాయిలో బలంగా పనిచేస్తోంది. కేరళ మరియు బెంగాల్ ఫలితాలు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. నాలుగవది, జాతీయ పార్టీలు ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ తన ఉనికిని దక్షిణాది మరియు తూర్పు రాష్ట్రాల్లో గణనీయంగా విస్తరించు కుంటోంది. ప్రస్తుతం దేశంలోని 21 రాష్ట్రాలలో అధికారంలో ఉండటం ద్వారా భాజపా జాతీయ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదిగింది.

మరోవైపు, ప్రాంతీయ పార్టీలు కూడా తమ మనుగడ కోసం సిద్ధాంతపరమైన మార్పులను చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఎన్నికలు గుర్తుచేశాయి. తమిళనాడులో ద్రవిడ పార్టీల ఆధిప త్యాన్ని విజయ్ పార్టీ సవాలు చేయడం అనేది ప్రాంతీయ రాజకీ యాల్లో వస్తున్న పెనుమార్పులకు సంకేతం.ఎన్నికల ప్రచార శైలి లో కూడా విప్లవాత్మక మార్పులు వచ్చాయి. సామాజిక మాధ్య మాలు, డిజిటల్ ప్రచారం ఓటర్ల ఆలోచనలను ప్రభావితం చేయ డంలో కీలక పాత్ర పోషించాయి. తమిళనాడులో విజయ్ పార్టీ మరియు బెంగాల్‌లో భాజపా ఈ సాంకేతికతను సమర్థవంతంగా వాడుకున్నాయి.

2026 పంచ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు భారత ప్రజా స్వామ్య వ్యవస్థలోని వైవిధ్యతను మరియు చైతన్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాయి. ఓటరు తన తీర్పు ద్వారా సుస్థిరతకు, అభివృద్ధికి మరియు సరికొత్త మార్పులకు పట్టం కట్టాడు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటముల లెక్కలు మాత్రమే కాకుండా, రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఒక దిక్సూచీగా నిలుస్తున్నాయి. అభివృద్ధి పరమావధిగా, ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా సాగే రాజకీయాలకే భవిష్యత్తు ఉంటుందని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. జాతీయ రాజకీయ యవనికపై కొత్త నాయకత్వాలు, సరికొత్త సమీకరణాలు ఆవిర్భవించడంతో భారత ప్రజాస్వామ్యం మరింత పరిణతి చెందిన దిశగా అడుగులు వేస్తోంది. ఈ చారిత్రక పరిణామాలు దేశ రాజకీయ దిశను, దశను మార్చి వేస్తాయ నడంలో ఎటువంటి సందేహం లేదు. అభివృద్ధి, పారదర్శకత మరియు ప్రజా ఆకాంక్షలను గౌరవించే రాజకీయ ప్రస్థానానికి ఈ ఫలితాలు ఒక బలమైన పునాదిగా నిలుస్తాయి.

**- వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

## ప్రజల ఆకాంక్షలను బిజెపి గౌరవించాలి !

దేశంలో అత్యధిక రాష్ట్రాలు ఇప్పుడు బిజెపి ఖాతాలో పడ్డాయి. మోడీ నామజపంతో పొంగిపోకుండా ప్రజలకు మార్పును చూపాలి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలకు పరిష్కారం దక్కాలి. విద్య,వైద్యం,ఉపాధి రంగాలకు పెద్దపీట వేయాలి. బిజెపి రావడం వల్లనే ఈ సమస్యలు పరిష్కారం అయ్యాయని ప్రజలు చర్చించాలి. అప్పుడే మార్పు సాధ్యం అవుతుంది. ఇకపోతే మిగతా రాష్ట్రాల్లో ఎలా ఉన్నా..బెంగాల్లో సరిహద్దులకు కంచె వేస్తామన్న బిజెపి హామీ నెరవేర్చాలి. ఇందుకు తక్షణం నడుం బిగించాలి. అలాగే చొరబాటుదారులను గుర్తించి నిర్దాక్షిణ్యంగా ఏరి పారేయాలి. ఎందుకంటే చొరబాటు దారులు స్థానిక ప్రజలను మించి, పెత్తనం సాగిస్తున్నారు. ఊరూరా జల్లెడ పట్టి వారిని గుర్తించాలి. రోహింగ్యాల విషయంలో ఎలాంటి క్షమాగుణం అవసరం లేదు. భారతదేశం ధర్మసత్రం కాదన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే ఇందుకు కార్యాచరణ సిద్దం చేయాలి. బెంగాల్‌తో పాటు అసోం, ఈశాన్య రాష్ట్రాలను జల్లెడపడితే తప్ప స్థానికంగా గొడవులు సద్దుమణగవు. ఒక్కొకక్కరిని గుర్తించి, వారి ఆధార్, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు వంటివన్నీ లాగేసుకుని సరిహద్దు దాటించాలి. అలాగే సరిహద్దు కంచెపైనా నిర్ణయం తీసుకోవాలి. ఇవే సమస్యలపై బిజెపి పోరాడింది కనుక ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రథమ కర్తవ్యం ఇదే కావాలి. యావద్భారతంలో ఆసక్తి రేకెత్తించిన ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే ప్రజలు మార్పును కోరుకున్నారు. బెంగాల్లో మమతా బెనర్జీ 15 ఏళ్ల రాక్షస పాలనను ప్రజలు తమ ఓటుహక్కుతో తిరస్కరించారు. ఇకపోతే తమిళనాటు విజయ్ గెలవడం ఓ సంచలనమే. ఆయన హామీలు గుప్పించారు. తెలుగు రాష్ట్రాల్లో లాగా బంగారం, మహిళలకు నెలనెలా పెన్షన్ లాంటి చెల్లింపులు తదితర హామీలు గుప్పించారు. ద్రవిడ పార్టీల ఆధిక్యాన్ని సవాలు చేస్తూ.. తమిళనాట సినీ హీరో విజయ్ అరంగేట్రంలోనే అదరగొట్టడంలో హామీల బుట్ట కూడా ఉంది. సినీ ఛరిష్మాకు తోడు, హామీలు కూడా కలసి వచ్చాయి. కనుక గత పాలకుల వైఫల్యాలను ముందు పెట్టుకుని విజయ్ నడుచుకుంటేనే నిలదొక్కు కోగలరు. కేరళలో యూడీఎఫ్ మళ్లీ పీఠమెక్కడంతో.. కామ్రేడ్లకు ఇక దేశంలో ఎక్కడా స్థానం లేకుండా పోయింది. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు బెంగాల్, త్రిపుర, కేరళలో అవకాశాలు లేనట్లుగానే భావించారు. ఇది వారి స్వయంకృతమనే చెప్పలి. నేలవిడిచి సాము చేయడం కమ్యూనిస్టులకు అలవాటు. కేరళలో కూడా అదే జరిగింది. పదేళ్ల పినరయ్ విజయన్ అధికారంలో కేరళలో గణనీయమైన మార్పులు గోచరించ లేదు. అస్సాంలో కమలం ముచ్చటగా మూడోసారి జయభేరి మోగించారు. పుదుచ్చేరిలో మళ్లీ సామాన్యుడికే పీఠం దక్కింది. అస్సాం, పుదుచ్చేరి తప్పిస్తే... అంతటా ఓటర్లు మార్పునే కోరుకున్నారు. భారత ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించిన రోజిది. మన రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థలు విజయం సాధించాయి. అని ప్రధాని మోడీ ప్రకటించుకున్నారు. ఒక్కో రాష్ట్రం బిజెపి ఖాతాలో పడుతున్న వేళ ప్రజలకు మేలైన పాలన దిశగా బిజెపి కృషి చేయాలి. లేకుంటే ఈ ఆనందం ఆవిరి కావడానికి కూడా సమయం పట్టదు. గంగోత్రి నుంచి గంగా సాగర్ వరకు కమలం వికసించిందన్న ప్రధాని మోదీ, ప్రజల ఆకాంక్షలను కూడా పట్టించుకోవాలి. దేశంలో అనేకానేక సమస్యలు ఉన్నాయి. వాటిపై కమలనాథులు దృష్టి సారించాలి. ఇద్దరు ముఖ్యమంత్రులు స్టాలిన్, మమతా బెనర్జీ తాము పోటీ చేసిన స్థానాల్లో ఘోర పరాజయం పాలయ్యారు. ఆయా రాష్ట్రాల్లో పలువురు మంత్రులు మట్టికరిచారు. భవానీపుర్‌లో పోటీ చేసిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ప్రత్యర్థి, ప్రతిపక్ష భాజపా నేత సువేందు అధికారి చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. ఆమెతో పాటు దాదాపు 20 మంది మంత్రులు ఓడిపోయారు. సువేందు అధికారి రెండు చోట్లా విజయం సాధించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో మమతా బెనర్జీ తీవ్ర అసహనానికి గురయ్యారు. చివరి వరకూ వేచి ఉండాలని, విజయం తమదేనని మధ్యాహ్నాం సమయంలో వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే సాయంత్రానికి తృణమూల్ పరాజయం పరిపూర్ణమైంది. రాజకీయాల్లో కక్షలు కార్పణ్యాలు తగవు. ప్రజలను ప్రజలుగా చూడలేని వారు అధికారానికి అనర్హులు. బెంగాల్లో ప్రజలకు గత పదిహేనేళ్లుగా స్వేచ్ఛ లేకుండా పోయింది. బెంగాల్ విజయంతో భాజపా స్వతంత్రంగా పాలించే రాష్ట్రాల సంఖ్య 15కు చేరనున్నాయి. అదనంగా బిహార్‌లో జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా, నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, మేఘాలయ లో నేషనల్ పీపుల్స్ పార్టీ తదితరాలతో కలిపి భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 21కి చేరుతోంది. దాదాపు 75శాతం రాష్ట్రాలు బిజెపి గుప్పిట ఉన్నట్లే. కనుక పాలనలో మార్పు కనిపించాలి. ప్రజలకు బిజెపి పట్ల అనురాగం పెరగాలి. ఇజెపికి ఓటేసినందుకు ప్రజలు ఆనందపడాలి. అందుకు అనుగుణంగా పాలనా పరమైన మార్పులు రావాలి. రాజకీయ పందురాలకు, ఉచిత పథకాలకు దూరంగా ఉండాలి. పన్నుల రూపంలో వచ్చే డబ్బులను అభివృద్ధికే వినియోగించాలి. అప్పుడే బిజెపిని మరోమారు ప్రజలు నమ్ముతారు. అందుకు కఠినమైన నిర్ణయాలకు కూడా వెనకాడరాదు.

# అన్నిరకాల దౌర్జన్యాలు చేశారు

### - తనపై కూడా దాడికి తెగబడ్డారు
### - ఫేస్‌బుక్ పేజీలో మమత ఫోన్‌కాల్ ఆడియో



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

కోల్‌కతా, మే 5 : కౌంటింగ్ సెంటర్‌లో తనపై దాడి జరిగినట్లు మమతా బెనర్జీ పేర్కొన్నారు. టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీతో ఫోన్‌కాల్‌లో ఆమె ఈ ఆరోపణలు చేశారు. మమతా బెనర్జీ మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను ఎంపీ కళ్యాణ్ బెనర్జీ తన ఫేస్‌బుక్ పేజీలో పోస్టు చేశారు. కౌంటింగ్ వద్ద ప్రవర్తన సరిగా లేదని, తుది రౌండ్ల సమయంలో అక్రమాలు జరిగినట్లు మమతా బెనర్జీ తన ఫోన్ కాల్‌లో పేర్కొన్నారు. భబానీపూర్‌లో తుది రౌండ్ల కౌంటింగ్ మా ప్రాంతానివని, ఆ సమయంలో కొందరు గుండాలు కౌంటింగ్ సెంటర్‌లోకి ప్రవేశించారని, నన్ను కొట్టారని, సీఆర్పీఎఫ్ సహాయంతో మా ఏజెంట్లను తోసేశారని మమతా బెనర్జీ ఆ ఫోన్‌కాల్‌లో ఆరోపించారు. కీలక సమయంలో కౌంటింగ్ హాల్‌లోకి తనను ఎంట్రీ కానివ్వ లేదన్నారు. భబానీపూర్‌లో కౌంటింగ్ పక్రియ థ్రిల్లింగ్‌గా సాగింది. 20 రౌండ్ల కౌంటింగ్‌లో కొన్ని సమయాల్లో అటూ ఇటూ వెళ్లింది. ఆరంభంలో మమతా బెనర్జీ రెండు వేల ఓట్ల మెజారిటీతో ఉన్నారు. ఏడో రౌండ్ సమయానికి ఆమె 17 వేల ఓట్లు ఆధిక్యంలోకి వెళ్లారు. ఇక ఆ సమయంలో టీఎంసీ మద్దతుదారులు దాదాపు సంబరాలు చేసుకున్నారు. ఇక తర్వాత ఫలితాల్లో మార్పు మొదలైంది. 14వ రౌండ్ ముగిసే వరకు మమతా బెనర్జీ ఆధిక్యం నాలుగు వేలకు పడిపోయింది. కొన్ని రౌండ్ల తేడాలోనే నాటకీయంగా బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి ఆధిక్యంలోకి వెళ్లారు. ఆ తర్వాత ఆయన 15,105 ఓట్ల తేడాతో విజయాన్ని నమోదు చేశారు. దీంతో దీదీకి షాక్ ఇచ్చాడు సువేంధు. 16వ రౌండ్ వరకు తానే లీడింగ్‌లో ఉన్నట్లు మమతా బెనర్జీ పేర్కొన్నారు. కానీ తమ పార్టీకి చెందిన కౌంటింగ్ ఏజెంట్లను తొలగించిన తర్వాత మార్పు మొదలైనట్లు ఆమె ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లను సరైన సీలింగ్ లేకుండానే స్ట్రాంగ్‌రూమ్ లకు తరలించారని, తుది రౌండ్ల కౌంటింగ్ సమయంలో కౌంటింగ్ హాల్‌లో టీఎంసీ ప్రతినిధులు లేరని ఆమె పేర్కొన్నారు. చిత్రహింసకు గురిచేసినట్లు మమతా బెనర్జీ ఆరోపించారు. కేంద్రం, బీజేపీ ఆదేశాల ప్రకారమే ఎన్నికల సంఘం, సీఆర్పీఎఫ్, స్థానిక ఎన్నికల అధికారులు వ్యవహరించినట్లు మమతా బెనర్జీ విమర్శించారు. ఓటర్ రోల్స్‌లోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. బలవంతంగా ఓట్లను చోరీ చేశారన్నారు. అన్ని ఆధారాలను డాక్యుమెంట్ చేశామని, వాటిని కోర్టులో సమర్పించనున్నట్లు తెలిపారు.ఇది బీజేపీ విజయం కాదు, అనైతిక గేమ్ అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. తాజాగా ఎన్నికల్లో ఆ పార్టీకి కేవలం 81 సీట్లు మాత్రమే వచ్చాయని తేలింది. బీజేపీ 206 స్థానాల్లో విజయ కేతనం ఎగురవేసింది. అయితే భవానీపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సీఎం మమతా బెనర్జీ అనూహ్య రీతిలో ఓటమి పాలయ్యారు.ఈ నేపథ్యంలో ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజా తీర్పును చోరీ చేశారని ఆమె అన్నారు. అనైతిక రీతిలో తనను ఓడించినట్లు ఆమె చెప్పారు.

# బ్యాంకులు, ఏటీఎంలలో భద్రత కట్టుదిట్టం

## అనుమానితులపై ప్రత్యేక నిఘా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 05 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి గోదావరిఖని సబ్‌డివిజన్ పరిధిలోని బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించబడినట్లు గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు. ఆయన పర్యవేక్షణలో గోదావరిఖని-1, 2 టౌన్, రామగుండం సర్కిల్, మంథని సర్కిల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల్లో పోలీస్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో గోదావరిఖని వన్ టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, అఫ్జలొద్దీన్, టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు, మంథని సీఐ రాజు, రామగుండం సీఐ కృష్ణకుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు. తనిఖీల సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి వారి వివరాలను సేకరించారు. నేర నియంత్రణలో భాగంగా బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల్లో అలారం వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలని, హై రిజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవి నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను కూడా పరిశీలించారు. ఏదైనా నేరం జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా నిందితులను సులభంగా గుర్తించవచ్చని, అలాగే అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడానికి వీటి ఉపయోగం ఎంతో ఉంటుందని పోలీస్ అధికారులు బ్యాంకు నిర్వాహకులకు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బ్యాంకుల భద్రత కోసం సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు, సరిపడా లైటింగ్, సెక్యూరిటీ గార్డుల ఏర్పాటు వంటి భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. బ్యాంకు ఆవరణ మొత్తం కవరయ్యేలా



కెమెరాలు ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్ భద్రతను కచ్చితంగా పాటించాలని తెలిపారు. అలాగే బ్యాంకులకు వచ్చే కస్టమర్లలో ఎవరైనా అనుమానాస్పదంగా ఎక్కువసేపు ఉన్నట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బ్యాంకు నుండి నగదు ఉపసంహరించుకుని వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా కస్టమర్లకు అవగాహన కల్పించాలని బ్యాంకు అధికారులకు సూచించారు.




# దళిత కార్మికురాలిపై అసభ్య పాట వైరల్

## -కఠిన చర్యల కోసం దళిత సంఘాల డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 05 : దళిత మహిళా కార్మికురాలిపై అసభ్య పదజాలంతో పాటను రాయించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు పోలీస్ అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు గుమ్మడి కుమారస్వామి మాట్లాడుతూ ఎర్రజెండా పార్టీ, యూనియన్ అని చెప్పుకునేవారు మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా! అని ప్రశ్నించారు. దళిత మహిళా కార్మికురాలి వ్యక్తి గత జీవితంపై పాట రాసినవారిని.. ఆ పాటకు సపోర్ట్ గా నిలిచి సోషల్ మీడియాలో వైరల్ చేసినవారిని పోలీసులు గుర్తించి, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎర్రజెండా పార్టీ, యూనియన్ కు బాధ్యులైన కూనమనేని సాంబశివరావు, వాసిరెడ్డి సీతారామయ్య ఆ వ్యక్తిని యూనియన్ నుండి తొలగించాలని కోరారు. దళిత మహిళా కార్మికురాలిపై అసభ్యంగా పాటను రాయించి, సోషల్ మీడియాలో వైరల్ చేసినవారు తమ తప్పును ఒప్పుకొని క్షమాపణ చెప్పాలని, లేదంటే దళితులందరూ యూనియన్ కార్యాలయం ముందు డప్పు దండోరా వేస్తామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్లు కాంపెల్లి సతీష్, దావు రమేష్, పర్స విజయ్ కుమార్, డిస్ట్రిక్ట్ లెవెల్ విజిలెన్స్ కమిటీ మెంబర్ కొండ కుమార్, నాయకులు కంబాల రామరాజు, సంపత్ కుమార్ తదితరులున్నారు.

# పంట మార్పిడి, లాభదాయక పంటలపై దృష్టి సారించాలి

**- ఆయిల్ పామ్ సాగును విస్తరించాలి - రైతులకు భారీ సబ్సిడీలు - వరి సాగు పెరుగుదల ఆందోళనకరం - ప్రత్యామ్నాయ పంటలే మార్గం - ప్రభుత్వ విప్ చింతకుంట విజయరామణరావు - ఎలిగేడు మండలంలో నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 05 : రైతులు పంట మార్పిడి చేసి లాభదాయక పంటలపై దృష్టి సారించాలని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరామణరావు సూచించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎలిగేడు మండలంలో మంగళవారం నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామణరావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయరామణరావు మాట్లాడుతూ తన చిన్ననాటి రోజుల్లో ఎలిగేడు మండలంలో కాలువ నీరు అందుబాటులో లేకపోయేదని గుర్తుచేశారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ నాయకత్వంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగి కాలువల ద్వారా రైతులకు నీరు అందించబడిందన్నారు. మొదటి దశలో అప్పటి కరీంనగర్ జిల్లాలో 5.4 లక్షల ఎకరాలకు నీరు అందించగా, అందులో 1.4 లక్షల ఎకరాలు పెద్దపల్లిలోనే ఉన్నాయని తెలిపారు. 2014 తర్వాత శ్రీరాంసాగర్ కాలువలను నిర్లక్ష్యం చేసి ఇతర ప్రాజెక్టులపై దృష్టి సారించడం వల్ల ఈ ప్రాంత రైతులకు నష్టం జరిగిందని విమర్శించారు. గతంలో పెసర్లు, జొన్నలు, కందులు వంటి పంటలు పండించిన రైతులు ఇప్పుడు ఎక్కువగా వరి పంటపైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. ఇది రైతులకు లాభదాయకం కాదని, పంట మార్పిడి చేపట్టి మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటలను సాగు చేయాలని, భూమి సారాన్ని కాపాడేందుకు యూరియా వినియోగాన్ని తగ్గించాలని, పంట అవశేషాలను కాల్చడం మానుకోవాలని సూచించారు. మన నియోజకవర్గంలో కొంతమంది రైతులు ఎకరానికి రూ.1 లక్ష నుండి రూ.1.5 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. వచ్చే ఏడాది ఎలిగేడు మండలంలో కనీసం వెయ్యి ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో అంతర్ పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని, మొదటి నాలుగేళ్లపాటు ఎకరానికి సుమారు రూ.52 వేల వరకు సబ్సిడీ అందిస్తున్నామని పేర్కొన్నారు. అంతర్ పంటలకు పూర్తి మద్దతు ఉంటుందని, ఐదేళ్ల క్రితం రూ.14 వేలుగా ఉన్న ఆయిల్ పామ్ ధర ప్రస్తుతం రూ.23 వేల వరకు పెరిగిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ధరలు పెరుగుతాయని, దేశంలో నూనెలకు దిగుమతులపై ఆధారపడుతున్నందున ఆయిల్ పామ్‌కు మంచి మార్కెట్ ఉందన్నారు. శ్రీరాంపూర్ ప్రాంతంలో కొత్త ఫ్యాక్టరీ రాబోతుండడంతో మార్కెటింగ్ సమస్యలు ఉండవని తెలిపారు. పెద్దపల్లి జిల్లా రైతులు సంపన్న రైతులుగా పేరొందినందున ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని సూచించారు. అదే విధంగా వరి సాగు రోజురోజుకీ పెరుగుతున్నదని, నాలుగేళ్లతో పోలిస్తే ప్రస్తుతం రోజుకు ఏడు రెట్లు ఎక్కువ వరి కొనుగోలు చేస్తున్నప్పటికీ ఇంకా అధికంగా మార్కెట్‌కు వస్తున్నదని తెలిపారు. అధిక ఉత్పత్తి రైతులకు లాభదాయకం కాదని హెచ్చరించారు. వడగండ్ల వానలు పెరుగుతున్న నేపథ్యంలో పంట నష్టాలను తగ్గించేందుకు రబీ సీజన్‌ను 7 నుంచి 10 రోజులు ముందుకు మార్చేలా రైతులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, తహసిల్దార్ యాకన్న, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వికారాబాద్, మే 05 : వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం పక డ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో అధికారులతో సమావేశము ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంబించాలని ,రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చే సమయంలో నిబంధన ప్రకారం మట్టి గడ్డలు, తప్ప, తేమ ఇతర నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, గొనె సంచులు అందుబాటులో ఉంచాలని, ఇతరమౌళిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు .ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యాన్ని వెంటనే తూకం వేసి, ఆలస్యం లేకుండా, రైతులు వేచి చూసే పరిస్థితి రాకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు కొనుగోలు చేసిన ధాన్యానికి జిల్లాలోని రైతులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ వెంకటాచారి, డిఆర్‌డిఎ శ్రీనివాస్, డిఎస్ఓ సుదర్శన్, డిఎంసిఎస్ మోహన్ కృష్ణ, వ్యవసాయ అధికారి రాజా రత్నం, మార్కెటింగ్ ఎండి రియాజ్,మార్కెట్ రేఖ, డిసిఓ నాగార్జున సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు

**- ఉద్యానవన, ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపాలి - జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 5 :రైతులకు ఆయిల్ ఫామ్ పంట తో అధిక లాభాలు చేకూరే అవకాశం ఉందని,ఉద్యానవన, ప్రత్యామ్నాయ పంటలపై కూడా రైతులు ఆసక్తి చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఉద్యానవన శాఖ అధికారి డి. సంజీవరావు అధ్యక్షతన మంగళవారం ములుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన ఉద్యానవన పంటల సాగు, ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెరుగుదల, ప్రత్యామ్నాయ పంటల సాగు పై అవగాహన సదస్సు కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ముఖ్య అతిథిగా హాజరై,రాష్ట్ర గేయాలపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు మాట్లాడుతూ రైతులు సేద్యం చేసే పంటల డిమాండ్ సప్లై లపై ధర నిర్ణయం అవుతుందని,మార్కెట్లో డిమాండ్ కలిగిన పంటలను సాగు చేయడం ద్వారా మెరుగైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. నిత్యవసర సరుకుగా ఉన్న వంట నూనె నిల్వలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, ఆయిల్ పంటకు మంచి డిమాండ్ ఉందని రైతులు ఆయిల్ ఫామ్ పంటపై ఆసక్తి కనబరుస్తూ ఇతర రైతులకు కూడా దాని ప్రయోజనాలను తెలియజేయాలని సూచించారు. ఆయిల్ ఫామ్ సాగు లో అంతర్గత పంటలను కూడా సేద్యం చేసుకోవచ్చని దీని ద్వారా రైతులు రెండు పంటల ద్వారా ఆదాయం లభించే అవకాశం ఉంటుందని,ఒకసారి ఆయిల్ ఫామ్ సాగుబడి చేస్తే 30 సంవత్సరాల వరకు నిరంతర పంట దిగుబడితో ఆదాయం సమకూరుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ములుగు మున్సిపాలిటీ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి మాట్లాడుతూ రైతులు ఆయిల్ ఫామ్ పంటపై పూర్తిస్థాయిలో



అవగాహన పెంపొందించుకోవాలని రైతులకు సూచించారు. ఆయిల్ ఫామ్ పంటలపై ప్రభుత్వం సబ్సిడీ కూడా అందించి రైతులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ముందుగా ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు మాట్లాడుతూ ములుగు జిల్లా వ్యాప్తంగా 1,069 మంది రైతుకు 3,562.40 ఎకరాల విస్తీర్ణం లో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారని, ఒక ఎకరాకు ప్రభుత్వం వివిధ అంశాలలో 50 వేల రూపాయల వరకు సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. ఉద్యానవన పంటలకు కూడా సబ్సిడీ అందిస్తుందని రైతులు పంట మార్పిడికి అంతర్గత పంటలు ఉద్యానవన పంటలపై జిల్లా రైతులు ఆసక్తి కనబరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, ఆత్మ కమిటీ చైర్మన్ చైర్మన్ రవీందర్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు బొల్లెపల్లి రాజేందర్, జిల్లా మత్స్యశాఖ అధికారి సాల్మన్ రాజు, డిసిఓ రామ్మోహన్, కె ఎన్ బయోసైన్స్ కంపెనీ యం డి సుధా రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, రైతులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాపూజీ నగర్‌లో పేలిన గ్యాస్ సిలిండర్

**- ధ్వంసమయిన ఇంట్లోని పలు విలువైన వస్తువులు**

**- సామాన్లు, ఇంటి పైకప్పు రేకులు**

**- పేలుడు తీవ్రతతో తీవ్ర భయాందోళనలో కుటుంబ సభ్యులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, మే 05 : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధి బాపూజీ నగర్ లో పెను ప్రమాదం తప్పింది. కర్రు రమాదేవి-రాజయ్య ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో ప్రమాదం సంభవించింది. వివరాల్లోకి వెళితే..కర్రు రమాదేవి కుటుంబం సోమవారం హనుమాన్ దీక్షాధారులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసిన అనంతరం ఇంట్లో వారందరూ ఇతర వనులలో నిమగ్నమై ఉండగా రాత్రి సుమారు 8 గం.ల సమయంలో ఇంట్లోని వంట గ్యాస్ లీక్ కావడంతో హనుమాన్ పీఠం వద్ద దీపాల వెలుగుకు లీకయిన గ్యాస్ తో ఒక్కసారిగా మంటలు అంటుకుని పేలుడు సంభవించడంతో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇంట్లోని పలు విలువైన సామాన్లు, వాషింగ్ మిషన్, రెండు రూములలోని ఇంటి పైకప్పు రేకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. పేలుడు తీవ్రతతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురికాగా ఎవరికి ప్రాణ నష్టం జరుగకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు వెంటనే స్పందించి కరెంట్ ఫ్యూజులు తీసివేసి, గ్యాస్ సిలిండర్ ను బయటకు తీసుకురావటంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపకశాఖకు సమాచారం అందించడంతో అగ్ని మాపక సిబ్బంది, స్థానిక వన్ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వరిస్థితిని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

# శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండగను జరుపుకోవాలి

**- పశువుల అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వండి**

**- సోషల్ మీడియాలో మత ఘర్షణలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు**

**- ముస్లిం మత పెద్దలతో డిఎస్పీ కార్యాలయంలో సమావేశం**

**- వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ: రాజేష్ మీనా**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 5 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వనపర్తి జిల్లాలో బక్రీద్, పండుగను సోదర భావంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్) రాజేష్ మీనా, ఐపీఎస్., అన్నారు. బక్రీద్, పండుగ సందర్భంగా మంగళవారం రోజు వనపర్తి డిఎస్పీ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ .. బక్రీద్, పండుగ శాంతియుత వాతావరణంలో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ పండుగ జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగలను మతసామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతపెద్దలు ప్రజల్లో సమన్వయంఏర్పడేలాచేయాలన్నారు .ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే పశువుల అక్రమ రవాణా కట్టడికి జిల్లా పరిధిలో పశుసంవర్ధక శాఖ సిబ్బందితో 3 చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి పశువులను రవాణాచేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు (వాలిడ్ డాక్యుమెంట్స్) ఉంటేనే, పరిశీలించి అనుమతిస్తారని అన్నారు. ప్రధానంగా నిబంధనలు విరుద్ధంగా పశువులు అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చట్టాన్ని ఏవరు కూడా తమ చేతుల్లోకి తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకొనిరావద్దని అన్నారు. ఏదైనా సమస్య వుంటే సామరస్య పరిష్కారానికి పోలీస్ అధికారులు నిరంతరం అందుబాటులో వుంటారని అన్నారు. ముఖ్యంగా యువత ఆవేశంతో చేస్తున్న చిన్న తప్పులు శాంతి భద్రతల సమస్యగా తలెత్తె ప్రమాదం వుంటుంది కాబట్టి మతపెద్దలు యువతకు సమన్వయం పాటించేలా దిశానిర్దేశం చేయాలని అన్నారు. ప్రధానంగా జిల్లాలో ఏచిన్న సంఘటన జరిగిన ఎడిటింగ్ చేసి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల ఐక్యతను, సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు, రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెట్టడం తద్వారా శాంతి భద్రతల సమస్య సృష్టించే ప్రయత్నం చేస్తున్న వారిపై పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిఘా పెట్టిందని తెలిపారు. సమావేశంలో ఇతర పోలీస్ అధికారులు కూడా పాల్గొని తమ తమ సూచనలు వెల్లడించారు. జిల్లాలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగేందుకు పోలీస్ శాఖ మరియు ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు పోలీసుశాఖ చర్యలను అభినందిస్తూ, శాంతి భద్రతలను కాపాడేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, ముస్లిం మత పెద్దలు,యువకులు,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ వేగవంతంగా నిర్వహించాలి

**- వేడిగాలుల నేపథ్యంలో కేంద్రంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలి**

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**- నర్సాపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**- పంట కొనుగోళ్లు, నిల్వలు, రవాణాపై సమగ్ర సమీక్ష**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 05 : ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం ఎలిగేడు మండలంలోని నర్సాపూర్, మంథనిలోని గంగపురి ఐకెపి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. కేంద్రానికి వచ్చిన పంట పరిమాణం, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ ఉన్న పంటను వెంటనే కొనుగోలు చేసి మిల్లర్లకు త్వరితగతిన తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రంలో అవసరమైన టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచాలని, గన్నీ బ్యాగుల సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వేడిగాలుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్రంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రవాణా వాహనాలు, హమాలీల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ యాకన్న, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఏడిఏ అంజని, అధికారులు పాల్గొన్నారు.

# నేడే మెగా జాబ్ డ్రైవ్

**- సుమారు 68 సంస్థలలో 3439 ఉద్యోగ అవకాశాలు**
**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 05 : పెద్దపల్లి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు మరింత విస్తరించేందుకు జిల్లా పరిపాలన యంత్రాంగం, టాన్స్క, డీట్ సంయుక్తంగా మే 6న పెద్దపల్లి లోని పద్ద ఏసీ కన్వెన్షన్ హాల్ లో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌లో సుమారు 20 లోకల్ సంస్థలు, 48 నాన్ లోకల్ సంస్థలు మొత్తం 68 సంస్థలు పాల్గొంటుండగా, సుమారు 3439 ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. జీతం రూ.18 వేల నుండి మొదలై 80వే ల వరకు ఉంటుందని తెలిపారు. టెలికాం అండ్ కమ్యూనికేషన్, కస్టమర్ సపోర్ట్ అండ్ బీపీఓ, సేల్స్ అండ్ మార్కెటింగ్, డిజిటల్ సర్వీసెస్, ఫీల్డ్ అసోసియేట్ వంటి వివిధ రంగాల్లో ఈ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. జిల్లాలోని యువత పెద్ద సంఖ్యలో అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. టాస్క్, డీట్ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల ద్వారా యువత ఈ తరహా జాబ్ డ్రైవ్ ద్వారా ఉద్యోగాలు సాధించి మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసీ, ఇంజనీరింగ్, ఎంబీఏ తదితర అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. యువత ఈ మెగా జాబ్ డ్రైవ్‌ను ఒక మంచి అవకాశంగా తీసుకొని పెద్ద సంఖ్యలో హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లతో పాటు ఆధార్, డీట్ పోర్టల్‌లో నమోదు చేసుకుని హాజరు కావాలని తెలిపారు. జిల్లా యువత ఉపాధి పొందడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా, జిల్లా సమగ్ర అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ఈ మేరకు జిల్లా పరిధిలో యువత భారీగా పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



## కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరం

**- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 05 : మెదక్ జిల్లా, రామాయంపేట మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామాయంపేట మండలంలో మొత్తం 96 చెక్కులకు గాను రూ.96,11,136 కోట్ల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు ఒక వరమని పేద కుటుంబాలపై పెళ్లి భారాన్ని తగ్గించడం కోసమే కళ్యాణ లక్ష్మి పథకం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు.



## భీమారం మండల కేంద్రంలో బిజెపి విజయోత్సవ సంబరాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


జగిత్యాల, మే 05 : దేశంలోని ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలలో అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించిన సందర్భంగా మంగళవారం భీమారం మండల కేంద్రం లో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి, మిఠాయి లు పంచి పెట్టి, విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ భీమారం మండల అధ్యక్షులు నాగం శివకుమార్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో ఇన్నాళ్లుగా కొనసాగిన పరిపాలనకు ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారని, అక్కడ సరికొత్త రాజకీయ వాతావరణం ఏర్పడిందని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో కూడా భారతీయ జనతా పార్టీకి ప్రజలు ఆదరణ పెరుగుతోందని, భవిష్యత్తులో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అదేవిధంగా అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలలో సాధిం చిన ఘన విజయం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ పార్లమెంట్ కో-కన్వీనర్ క్యాతం దశరథ్ రెడ్డి, సర్పంచ్ లు మనోజ్ రెడ్డి, లింగం గౌడ్, ఏనుగుల లచ్చన్న, సీనియర్ నాయకులు సత్యనారాయణ, గంగారెడ్డి, సాయి రెడ్డి, పల్లి వంశీ, దుంపేట తిరుపతి, జలపతి రెడ్డి, ముంజ రాజా గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు లింగారెడ్డి, రాజేశం, మధు కుమార్, మల్లేష్, మైదం శేఖర్, ఏలేటి సతీష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికురాలి కుటుంబానికి చేయూతను అందించిన బిజెపి కౌన్సిలర్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 05 : మెట్‌పల్లి మున్సిపల్ కార్మికురాలు మోర్తాడ్ భాగ్యలక్ష్మి అకాల మరణం చెందడంతో స్థానిక బిజెపి కౌన్సిలర్లు మంగళవారం ఆ కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సంతాపం తెలియజేసి, ఆమె కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. రాబోయే రోజుల్లో ఆ కుటుంబానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చా రు. ఆ కుటుంబ సభ్యుల్లో ఒకరికి మునిసిపల్ లో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్, మున్సిపల్ ఫోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణు, వైస్ ఫ్లోర్ లీడర్ బొడ్ల ఆనంద్, జుంగుల అనిల్ గౌడ్ లోలపు అనిల్, బత్తుల జగదీశ్, పాస్ కంటి శ్రీనివాస్, సంకు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## వీరభద్రస్వామికి ఘనంగా జాతర బండ్ల ఊరేగింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్ మే 05 : మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జాతరబండ్లను ఘనంగా ఊరేగించారు. బ్రహ్మోత్స వాల్లో భాగంగా వీరభద్రాలయంలో ప్రత్యేక పూజలతో భక్తులు భక్తితో ఓం నమో శివాయ.. హర హర అంటూ శివనామా స్మరణలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చన, అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో గ్రామస్తులంతా ఐక్యమత్యంతో అందరు కలిసి కట్టుగా కులానికి ఏ బండి చొప్పున అందంగా బండ్లను ముస్తాబు చేసి జాతరలో ఆట పాటలతో గుట్ట చుట్టు బండ్లను ఊరేగించారు. జాతరలో ఎలాంటి అసౌకర్యాలు చోటు చేసుకోకుండా ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్, గ్రామ సర్పంచ్ అవినాష్ లు శ్రద్ధ చూశారు. ఎలాంటి అవంఛనీయ సంఘటన చోటు చేసుకో కుండా పోలీసు సిబ్బంది. బందోబస్తును ఏర్పాటు చేశారు.

## పదోన్నతులు కృషికి గుర్తింపు

**మెదక్ ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 05 : పోలీసు శాఖలో క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించే సిబ్బందికి తగిన గుర్తింపు ఎప్పటికప్పుడు లభిస్తుందని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అన్నారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పదోన్నతులు లభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కానిస్టేబుల్ స్థాయి నుండి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన వారిలో హవేలీఘనపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన నరహరి, నార్సింగి పోలీస్ స్టేషన్‌కు చెందిన మోహన్, మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చెందిన గోవర్ధన్, మెదక్ టౌన్ ట్రాఫిక్ విభాగానికి చెందిన తహెర్ అలీ ఉన్నారు. విధి నిర్వహణలో వారి అంకితభావం,కృషికి గుర్తింపుగానే ఈ పదోన్నతులు లభించాయని పేర్కొన్నారు. పదోన్నతి పొందిన సిబ్బంది జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా వారికి కొత్త హోదా చిహ్నాలను అలంకరించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "పదోన్నతులు కేవలం హోదాను మాత్రమే కాదు,బాధ్యతలను కూడా పెంచుతాయని,సిబ్బంది మరింత నిబద్ధతతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని,శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణే మన ప్రధాన లక్ష్యం" అని సూచించారు. విధి నిర్వహణలో నిజాయితీ, బాధ్యతతో పనిచేస్తే ఉన్నత స్థాయికి ఎదగడం సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో సిబ్బంది కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**- మంత్రి దామోదర్ రాజనర్సింహ**
**- దివ్యాంగులకు ఉచిత స్కూటీలు - అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సంగారెడ్డి, మే 05 : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉం దని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జోగిపేట- ఆందోల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉం దన్నారు. రాబోయే రోజుల్లో అన్ని అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, ఆయాలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనబడితే ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. అదేవిధంగా, అంగన్వాడీ టీచర్లు, ఆయాల ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి తెలిపారు. ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఈ కార్యక్రమంలో మంత్రి 10 మంది దివ్యాంగులకు ఉచిత స్కూటీలు, 286 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, సిడిపిఓలు, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, దివ్యాంగులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# పామాయిల్ సాగు రైతు కు దీర్ఘకాలిక ఆదాయం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 5 : పామాయిల్ సాగు రైతులకు దీర్ఘకాలిక ఆదాయమని తక్కువ పెట్టుబడి అధిక ఆదాయం అందించే ఈ పంట సాగు అందరూ ముందుకు రావాలని రామగుండం ఉద్యాన అధికారి జ్యోతి కోరారు మంగళవారం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో అంతర్గాం మండలం సోమనపల్లిలో పాలకుర్తి అంతర్గాం మండలాల రైతులకు పామాయిల్ సాగు విస్తీర్ణం పెంపుదల ప్రత్యామ్య పంటలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. పామాయిల్ సాగు ఒక ఎకరానికి 50 నుంచి 57 మొక్కలు నాటుకోవచ్చని రామగుండం ఉద్యాన వాన అధికారి జ్యోతి అన్నారు. పామాయిల్ సాగుకి, చీడ, పీడ, బెడదలు ఉండవని, ఒకసారి నాటుకుంటే 30 సంవత్సరాల వరకు దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చని అన్నారు. నూనె గింజల పంటల్లో పామాయిల్ ఎక్కువ దిగుబడినిస్తూ సంవత్సరానికి ఎకరాకు 1 లక్ష20 వేల ఆదాయం పొందవచ్చని అన్నారు రైతులు పండించిన పంట ఫామ్ ఆయిల్ కంపెనీల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసి 15 రోజుల వ్యవధిలో రైతు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని జ్యోతి వివరించారు పామ్ ఆయిల్ గెలల ధర ప్రస్తుతం మెట్రిక్ టన్ 23 వేల 501 రూపాయలు ఉ ఒదని రైతులు పామ్ ఆయిల్ సాగుకు ముందుకు రావాలని కోరారు. పామ్ ఆయిల్‌తో పాటు మామిడి జామ బొప్పాయి కరటిపండ్ల తోటలకు కూరగాయల పంటలకు 100 శాతం రాయితీ ఉందని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో కేవీకే శాస్త్రవేత్త బినవ్య, వ్యవసాయ అధికారి సతీష్, ఉద్యానవనం విస్తరణ అధికారి బి.రాము, ఏఈఓ రమేష్, కంపెనీ ప్రతినిధి రాజ్ కుమార్, సోమనపల్లి సర్పంచ్ బాపు, పటియాల సర్పంచ్ లోకేష్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు. పామాయిల్ సాగు కోసం రైతులు పట్టా పాస్ బుక్ జిరాక్స్ ఆధార్ కార్డు బ్యాంకు బుక్ జిరాక్స్ పాస్పోర్ట్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని జ్యోతి కోరారు.

# గో రక్షకులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

**కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 05 : గో రక్షకులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, సంయమనం పాటించాలని కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ కోరారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా మంగళవారం కోరుట్ల పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో సీఐ కె.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్ మూడు మండలాలకు చెందిన బిజెపి తదితర హిందూ సంఘాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..గో రక్షకులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, ఎవరైనా గోవుల అక్రమ రవాణా, గోవధకు పాల్పడితే డయల్ 100 ద్వారా లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు స్పందించి చర్యలు తీసుకుంటారని, గో రక్షకులు సంయమనం పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ తొందరపడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని కేసుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దని సూచించారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి, నిరంతరం నిఘా పెడుతున్నామని పేర్కొన్నారు. గోవుల అక్రమ రవాణా, గోవధకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బక్రీద్ పండుగ శాంతియుతంగా జరగడానికి అన్ని వర్గాల ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కోరుట్ల ఎస్సైలు చిరంజీవి, రామచంద్రం, మేడిపెల్లి శ్రీధర్ రెడ్డి, బిజెపి కోరుట్ల పట్టణ, మండల అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ, పంచిరి విజయ్, బిజెవైయం పట్టణ అధ్యక్షుడు కలాల సాయిచంద్, మేడిపెల్లి, భీమారం బిజెపి మండలాల అధ్యక్షులు చిట్యాల సురేష్, నాగం శివ కుమార్, సర్పంచులు తిరుపతి రెడ్డి, దుంపల మనోజ్ రెడ్డి, ఏనుగుల లచ్చయ్య, స్థానిక పోలీస్ సిబ్బంది, హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 10న ప్రధాని మోడీ సభను విజయవంతం చేయండి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 05 : ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో ప్రధాని నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభను బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం రోజు బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వడ్లసంతోష్ చారి అధ్యక్షతన కొత్తపల్లి ఫంక్షన్ హాల్ లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ, సీనియర్ నాయకులు నారాయణ,మండల ప్రధాన కార్యదర్శి నాగభూషణం, లక్ష్మణ రావు,ఉపాధ్యక్షులు బొక్కల బాగేష్, మల్లేశం, కార్యదర్శులు వెంకట్, వడ్ల చంద్ర శేఖర్, రాజు, సాయిబాబా, సున్నం లక్ష్మణ్, సాయిలు, శంకరయ్య, మల్లేశం, ఓబిసి మోర్చా వడ్ల భాగేష్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు జగదీష్,తాడేపు శేఖర్,చక్ర పాణి, కుమార్, గోపాల్, కోశాధికారి రాజేందర్, శంకరయ్య పాల్గొన్నారు.



## నాలా విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


శేరిలింగంపల్లి, మే 5 : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ధరణినగర్ నాల విస్తరణ పనులలో భాగంగా పరికి చెరువు అలుగు నుండి ప్రేమ్ సరోవహర్ అపార్టుమెంట్స్ వరకు రూ.8 కోట్ల 76 లక్షల రూపాయల అంచనావ్యయంతో చెవుడుతున్న నాల విస్తరణ పనులను ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి ఎమ్మెల్యే, పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలల విస్తరణ పనులు చేపట్టడంతో ఎన్నో ఏండ్ల వరద ముంపు సమస్య కు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధరణి నగర్‌కాలనీలో నాల విస్తరణ పనులలో భాగంగా అసం పూర్తిగా మిగిలిపోయిన నాల నిర్మాణము పనులు చేపట్టడం జరుగు తుంది అని, నాల విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డిపి ఇంజనీరింగ్ విభాగం డిఈ ధీరజ్, ఏఈ అరుణ్ నాయకులు దొడ్ల రామ కృష్ణ గౌడ్, జిల్లా గణేష్, కాశినాథ్ యాదవ్, శివరాజ్ గౌడ్, రాజేష్, సంతోష్, శ్రీధర్, ఉమేష్ , కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## రైతుల మేలుకోసమే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 5 : రక్తాన్ని చెమటగా మార్చి ఆరు గాలం శ్రమించి పండించిన వరి ధాన్యం పంటలకు మధ్య దళారీల దోపిడీ లేకుండా శ్రమకు తగ్గ పంటకు గిట్టుబాటు ధర అందించేం దుకే రాష్ట్ర తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని రామగుం డం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ అన్నారు. మంగళవారం అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ కష్టానికి తగిన ప్రతిఫలం పొందేలా ప్రభుత్వం కట్టు బడి పని చేస్తుందని ఈ కేంద్రాల ద్వారా ఆ లక్ష్యం మరింత బలపడు తోందని మనాలి ఠాకూర్ అన్నారు. ఈ సందర్భంగా వేసవి వేడి దృష్టిలో ఉంచుకొని కూలీలకు రైతులకు ఓఆర్ఎస్ పాకెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు సర్పంచులు పాల్గొన్నారు.



## మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

**- కథలాపూర్ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల ప్రతినిధి, మే 05 : భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల శాఖ అధ్యక్షులు మల్యాల మారుతి ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మల్యాల మారుతి మాట్లాడుతూ..ఈ నెల 10,న సికింద్రాబాద్ పరేడు గ్రౌండ్‌లో జరిగే మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని, ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ముఖ్య నాయకులు గ్రామాల్లో సమావేశం ఏర్పాటు చేసి జనసమీ కరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నరెడ్ల రవి, కౌన్సిల్ సభ్యులు కథలాపూర్ మహేష్, సీనియర్ నాయకులు గాందారి శ్రీనివాస్, పిడుగు ప్రతాప్ రెడ్డి, కల్లెడ ప్రసాద్, కిషోర్, రాజేష్ పాల్గొన్నారు.



# రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 5: రైతును ఆర్థికంగా బలోపేతం చేసి రాజు స్థాయికి తీసుకెళ్లడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల మండలంలోని జుక్కల్ గ్రామంలో ఉన్న బి.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఉద్యానవన పంటల సాగు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల మార్పిడి పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ పంటలతో పాటు ఉద్యానవన పంటలు, ఆయిల్ పామ్ సాగును విస్తరించుకోవడం ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని సూచించారు. ఈ విధానాలు రైతులను ఆర్థికంగా మరింత బలపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఉద్యానవన శాఖ అధికారి, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, సంబంధిత శాఖల అధికారులు, ఎమ్మార్వో, ఎంపీడీవో, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రతాపగిరి పంచాయతీకి రూ.15 లక్షల సి.ఆర్.ఆర్ నిధులు మంజూరు

## మంత్రికి సర్పంచ్ వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, మే 5:మండలంలోని ప్రతాపగిరి గ్రామపంచాయతీకి రూ.15 లక్షల సి.ఆర్.ఆర్ నిధులు మంజూరైన సందర్భంగా ఐటి మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు గ్రామ సర్పంచ్ వూర వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులను విడుదల చేయడం పట్ల మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పనులు చేపడతామని పేర్కొన్నారు.

# మొబైల్ డేటా తో మిస్టరీ చేదన

## - భువనగిరి పోలీసుల సక్సెస్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి–భువనగిరి, మే 5:ప్రాణ స్నేహితుడినే దారుణంగా హత్య చేసి, ఆధారాలు చెరిపివేయడానికి శవాన్ని తగలబెట్టిన ఘటనలో నిందితుడిని భువనగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎలాంటి క్లూ లేని ఈ కేసును సాంకేతిక ఆధారాలతో ఛేదించారు . పోలీసుల కథనం ప్రకారం ఆల్వాల్ ప్రాంతానికి చెందిన పొన్నకంటి కాశి (23), తన మిత్రుడు పొన్నకంటి శేఖర్‌పై పాత కక్షతో హత్యకు పాల్పడ్డాడు. గతంలో జరిగిన దొంగతనం ఘటనలో తన పేరును బయటపెట్టాడన్న ఆగ్రహంతో పథకం రచించాడు. శేఖర్‌ను బైక్‌పై తీసుకెళ్లిన కాశి, మార్గమధ్యంలో మద్యం తాగించి, పెట్రోల్ కొనుగోలు చేశాడు. అనంతరం భువనగిరి పరిసరాల్లోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, మద్యం మత్తులో ఉన్న శేఖర్‌ను గొంతు నులిమి హత్య చేశాడు. తర్వాత శవంపై పెట్రోల్ పోసి తగలబెట్టి, ఆధారాలు చెరిపేందుకు మృతుడి మొబైల్ ఫోన్‌ను ధ్వంసం చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనా స్థలంలో శవం పూర్తిగా కాలిపోవడంతో పోలీసులకు ఎలాంటి ఆధారాలు దొరకలేదు. అయినప్పటికీ మిస్సింగ్ కేసుల వివరాలు, సెల్ టవర్ డేటా, సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించి నిందితుడిని గుర్తించారు. మంగళవారం తెల్లవారుజామున ఆల్వాల్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన యాక్టివా బైక్, మృతుడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేని కేసును సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ అభినందించారు.

# ఘనంగా కో-ఆప్షన్ సభ్యుల ప్రమాణ స్వీకారం

## ధ్రువపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి–భువనగిరి, మే 5:యాదాద్రి–భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట, ఆలేరు మున్సిపాలిటీలలో కోఆప్షన్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదనపై యాదగిరిగుట్ట పట్టణంలో గౌలికార్ అరుణ, సయ్యద్ రహిమ, బండి జంగమ్మ, షరీఫ్, ఎం.ఎస్. విజయ్ కుమార్, చింతకింది మురళి, గుత్తా శమంతారెడ్డి కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. అదేవిధంగా సీపీఎం తరపున ఇంతియాజ్ ఇర్ఫానా కోఆప్షన్ సభ్యురాలిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఎన్నికైన సభ్యులకు ధ్రువపత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

# సెప్టిక్ షాక్‌తో ప్రాణాపాయంలో ఉన్న మహిళకు యశోదలో నూతన జీవం

## అత్యాధునిక చికిత్సతో 51 ఏళ్ల మహిళను కాపాడిన వైద్యులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 5:సెప్టిక్ షాక్‌తో పాటు బహుళ అవయవాల పనితీరు దెబ్బతినడం, ఆకస్మిక మూత్రపిండ గాయంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన 51 ఏళ్ల మహిళకు మలక్‌పేట్‌లోని యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యులు విజయవంతంగా చికిత్స అందించి ప్రాణాలను కాపాడారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆసుపత్రి యాజమాన్యం ఈ వివరాలను వెల్లడించింది. అసమాజంలో సోకే ఊపిరితిత్తుల సంక్రమణ కారణంగా పరిస్థితి విషమించిన ఈ రోగి శ్వాసలో ఇబ్బంది, కాళ్ల వాపు, మూత్ర విసర్జన తగ్గడం వంటి లక్షణాలతో అత్యవసరంగా ఆసుపత్రిలో చేరింది. డా. చెతన్ వీరమనేని నేతృత్వంలోని మూత్రపిండ వైద్యం, ఊపిరితిత్తుల వైద్యం, గుండె సంబంధిత వైద్యం, సాధారణ వైద్య విభాగాల సమన్వయంతో సమగ్ర చికిత్స అందించారు. అత్యాధునిక నిరంతర రక్త శుద్ధి విధానాలు మరియు అనంతరం నెమ్మదిగా నిర్వహించే డయాలిసిస్ పద్ధతుల ద్వారా శరీరంలో పేరుకున్న విషతుల్యాలను తొలగించారు. ఊపిరితిత్తుల సంక్రమణ, ఛాతిలో ద్రవం పేరుకుపోవడం వంటి సమస్యలకు ప్రత్యేక ఔషధాలు, శ్వాస సహాయక చికిత్స అందించగా, గుండె పనితీరును స్థిరపరచడానికి అవసరమైన వైద్య సేవలు కూడా అందించారు. సమయానికి చేపట్టిన చికిత్స, విభిన్న వైద్య విభాగాల సమన్వయం, ఆధునిక సాంకేతిక సదుపాయాల వల్ల రోగి ఆరోగ్యం క్రమంగా మెరుగై ఎటువంటి క్లిష్టతలు లేకుండా డిశ్చార్జ్ అయ్యారు. ఇలాంటి క్లిష్టమైన సెప్సిస్ కేసుల్లో త్వరితగతిన వైద్యం అందించడం




ప్రాణాలను కాపాడడంలో అత్యంత కీలకమని వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న అత్యాధునిక ఐసీయూ సదుపాయాలు, ఉన్నత స్థాయి డయాలిసిస్ యంత్రాలు, అనుభవజ్ఞులైన వైద్యుల బృందం అందుబాటులో ఉండటంతోనే ఇలాంటి సంక్లిష్ట కేసులకు విజయవంతంగా చికిత్స చేయగలుగుతున్నామని ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. సంక్లిష్ట మూత్రపిండ వ్యాధులకు సురక్షితమైన, నాణ్యమైన వైద్యం అందించడంలో తమ ఆసుపత్రి ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# కోమటిపల్లి గ్రామానికి తక్షణం బస్సు సౌకర్యం కల్పించాలి

## ప్రభుత్వానికి ఆళవందార్ వేణు మాధవ్ విజ్ఞప్తి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్ , మే 5:మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామానికి తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని హైదరాబాద్‌కు చెందిన డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయాధారిత గ్రామంగా పేరుగాంచిన కోమటిపల్లిలో ప్రకృతి సంపద ఉన్నప్పటికీ, ప్రాథమిక సౌకర్యాల కొరత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన తెలిపారు. ముఖ్యంగా రవాణా సౌకర్యం లేకపోవడం గ్రామ అభివృద్ధికి పెద్ద అడ్డంకిగా మారిందన్నారు. గ్రామానికి సమీపంలోని కేసముద్రం రైల్వే స్టేషన్, వ్యవసాయ మార్కెట్ సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉండగా, మహబూబాబాద్ జిల్లా కేంద్రం దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో ఉందని చెప్పారు. సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు నడక లేదా ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందని, ఆటోల్లో ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా పరిస్థితుల వలన ప్రజలు ప్రయాణించాల్సి వస్తోందని వివరించారు. గ్రామంలో వైద్య సదుపాయాలు లేకపోవడం వల్ల చిన్న అనారోగ్య సమస్యలకే సమీప పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని, అత్యవసర పరిస్థితుల్లో రవాణా లేకపోవడం ప్రాణాపాయ పరిస్థితులను సృష్టిస్తోందని తెలిపారు. గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గ్రామ పరిసరాల్లో గిరిజన లంబాడీ తాండాలు ఉండగా, అక్కడి ప్రజలు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల విషయంలో మరింత వెనుకబడి ఉన్నారనిపేర్కొన్నారు.బస్సు సౌకర్యం కల్పిస్తే వారు కూడా ప్రధాన ప్రవాహంలోకి రావచ్చన్నారు. విద్యార్థులు సమీప పట్టణాల్లోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు రవాణా లేక ఇబ్బందులు పడుతున్నారని, దీనివల్ల కొంతమంది చదువును మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించడంలో కూడా రవాణా కొరత వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,తగిన ధరలుపొందలేకపోతున్నారనితెలిపారు.కాబట్టి కోమటి పల్లి గ్రామానికి తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆళవందార్ వేణు మాధవ్ విజ్ఞప్తి చేశారు.

# ఎండల తీవ్రత దృష్ట్యా ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

## జయశంకర్జి-భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్జి–భూపాలపల్లి, మే 5:పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవి కాలంలో వడదెబ్బ ప్రమాదకరమని, సరైన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రత్యేకించి చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు, కూలీలు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణ రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వేసవిలో నీరసం సమస్యలు అధికంగా ఉంటాయని, రోజుకు కనీసం 12--15 గ్లాసుల నీరు త్రాగాలని సూచించారు. మితమైన ఆహారం తీసుకోవాలని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటికి వెళ్లకుండా నీడలో ఉండాలని తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండ సంబంధిత వ్యాధులు ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, వీరు త్వరగా నీరసం బారిన పడే అవకాశం ఉందన్నారు. మద్యం, ధూమపానం, గ్యాస్ పానీయాలను దూరంగా ఉంచాలని సూచించారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు కళ్లకు సన్ గ్లాసెస్, తలకు టోపీ లేదా కాటన్ గుడ్డ వంటివి ధరించాలని, ఉదయం 11 గంటల లోపు లేదా సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే బయటకు వెళ్లాలని తెలిపారు. ఎండలో పనిచేసే వారు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి ఐదు నిమిషాలు నీడలో విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆహారంలో ద్రవ పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని, కారం, మసాలా పదార్థాలను తగ్గించాలని తెలిపారు. ప్రయాణాల సమయంలో లవణాలు, శక్తినిచ్చే ద్రావణాలు తీసుకోవడం మంచిదన్నారు. పుచ్చకాయ, కీరదోస, ఖర్జూరం, తాటి ముంజలు, బీరకాయ, పొట్లకాయ వంటి నీటి శాతం అధికంగా ఉన్న పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలుగా జ్వరం, తలనొప్పి, నీరసం, కళ్ళు తిరగడం, వాంతులు, విరోచనాలు, నోరు ఎండిపోవడం, అపస్మారక స్థితి వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. అలాంటి సందర్భాల్లో బాధితుడిని వెంటనే చల్లని నీడ ప్రదేశానికి తరలించి తక్షణ వైద్య సహాయం అందించాలని సూచించారు. వేసవిలో రక్షణ కోసం తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తరచుగా తాగాలని, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామపంచాయతీలు, ఆశా సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.

# చేనేత కార్మికుల కోసం మెగా మెడికల్ క్యాంప్

## 75 మందికి చికిత్స

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి–భువనగిరి, మే 5:చేనేత కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం మంగళవారం రామన్నపేట ఏరియా ఆసుపత్రిలో మెగా మెడికల్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ గరికేపాటి సత్యనారాయణ ప్రారంభించారు. క్యాంపులో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించారు. వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించగా, శ్వాసకోశ సమస్యలున్న వారికి ఛాతీ ఎక్స్‌రేలు తీశారు. అవసరమైన వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ మెడికల్ క్యాంపులో మొత్తం 75 మంది చేనేత కార్మికులకు చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు జెల్లా వెంకటేష్, టౌన్ యూనిట్ అధ్యక్షుడు రాచా యాదగిరి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. స్వేత ప్రియాంక, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. సుమన్ కళ్యాణ్, మెడికల్ ఆఫీసర్ డా. అశ్విని కుమార్, హెచ్ఈఓ గోపాల్, సూపర్వైజర్ వాణిశ్రీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


# రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 5: రైతును ఆర్థికంగా బలోపేతం చేసి రాజు స్థాయికి తీసుకెళ్లడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల మండలంలోని జుక్కల్ గ్రామంలో ఉన్న బి.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఉద్యానవన పంటల సాగు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల మార్పిడి పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ పంటలతో పాటు ఉద్యానవన పంటలు, ఆయిల్ పామ్ సాగును విస్తరించుకోవడం ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని సూచించారు. ఈ విధానాలు రైతులను ఆర్థికంగా మరింత బలపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఉద్యానవన శాఖ అధికారి, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, సంబంధిత శాఖల అధికారులు, ఎమ్మార్వో, ఎంపీడీవో, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




# తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందిస్తున్న సింగరేణి పాఠశాల




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి , మే 5: భూపాలపల్లి పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల యాజమాన్యం ప్రకటించింది. ఈ మేరకు సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ కావూరి మారుతి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత మూడు సంవత్సరాలుగా పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు అత్యధిక మార్కులు సాధిస్తున్న ఈ పాఠశాలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులకు బోధన జరుగుతోందని వివరించారు. 2026–27 విద్యా సంవత్సరానికి గాను 1వ తరగతి నుండి 9వ తరగతి వరకు అడ్మిషన్లు కొనసాగుతున్నాయని, సింగరేణి ఉద్యోగులు మరియు పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. నాంచారయ్య, కరస్పాండెంట్ కె. మారుతి తెలిపారు.

# జనగణన శిక్షణ పూర్తి...మే 11 నుంచి గృహ గణన ప్రారంభం

## జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి-భువనగిరి, మే 5:యాదాద్రి-భువనగిరి జిల్లాలో జనగణన కార్యక్రమానికి సంబంధించి నిర్వహించిన నాలుగు దఫాల శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,461 మంది ఎన్యుమరేటర్లు, 258 మంది సూపర్వైజర్లకు సమగ్ర శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది మే 11, 2026 నుంచి ప్రారంభమయ్యే గృహ గణన (హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్) కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలు మే 10లోపు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పూర్తి చేసుకుంటే ప్రక్రియ వేగవంతంగా సాగుతుందని సూచించారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ సహకరించాలని జిల్లా పరిపాలన తరఫున విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం

**- పార్టీ బలోపేతంపై విస్తృత చర్చ**
**- పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి-భువనగిరి, మే 5:యాదాద్రి-భువనగిరి జిల్లా కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం మంగళవారం భువనగిరి పట్టణంలోని హోటల్ వివేరాలో విస్తృతంగా నిర్వహించారు. ఈ సమావేశానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ కార్యక్రమాల అమలు, నాయకత్వ సమన్వయం వంటి కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో బలమైన నిర్మాణం ఉండేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా ప్రజలకు చేరవేయాలని ఆయన పేర్కొన్నారు. పథకాల అమలులో ఎటువంటి లోపాలు లేకుండా చూసి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. రాబోయే పార్టీ కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు విస్తరణ, సంగఠన్ సృజన్ అభియాన్ అమలు, గ్రామం నుంచి బూత్ స్థాయి వరకు కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీని కేడర్ స్థాయిలో మరింత బలపరిచేందుకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు. అదేవిధంగా నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు స్పష్టమైన ఫలితాలు కనిపించేలా చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ కె. శంకర్ నాయక్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్, డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# మహిళలు సాంకేతిక రంగాల్లో ముందుకు రావాలి

**- సింగరేణి భూపాలపల్లి ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి**
**- హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ధ్రువపత్రాలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 5: సింగరేణిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు సంప్రదాయ పరిమితులను అధిగమించి సాంకేతిక రంగాల్లో ముందుకు రావాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి సూచించారు. భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళా ఉద్యోగులకు జిఎం ధ్రువపత్రాలు అందజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్)లో నిర్వహించిన 30 రోజుల శిక్షణలో కంపెనీ వ్యాప్తంగా 13 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. ఇందులో భూపాలపల్లి ఏరియా నుండి కే.రేణుక, పి.రమ్య శ్రీ, కే.భార్గవి, డి.అనూష విజయవంతంగా శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏనుగు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, హెవీ వెహికల్ డ్రైవింగ్ వంటి రంగాల్లో మహిళల ప్రవేశం వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా సంస్థలో సమాన అవకాశాల కల్పనకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇలాంటి నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందుకు తోడ్పడతాయన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ పొందడం ద్వారా డంపర్ ఆపరేటర్, మోటార్ ఆపరేటర్‌లుగా ఉద్యోగ అవకాశాలు పొందగలరని వివరించారు. ఇతర మహిళా ఉద్యోగులు కూడా ఇటువంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు సింగరేణి కట్టుబడి ఉందని, మహిళలు సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించేలా అన్ని విధాలా సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జి.ఎం. ఎస్.కవీంద్ర, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మాటూరి రవీందర్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బి.మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మే 15లోపు సరస్వతి అంత్య పుష్కరాల పనులు పూర్తి చేయాలి

**- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ - అధికారులతో సమీక్షా సమావేశం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి , మే 5:సరస్వతి అంత్య పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు మే 15లోపు పూర్తి చేయాలని జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి రెవెన్యూ, పోలీసు, అటవీ, రవాణా, వైద్య, సాగునీటి, అగ్నిమాపక, విద్యుత్, మత్స్య, ఆర్టీసీ, మిషన్ భగీరథ, దేవాదాయ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. చలువ పందిళ్లు, బట్టలు మార్చుకునే గదులు, వృద్ధులు, దివ్యాంగుల కోసం బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హెలిప్యాడ్ నుండి సరస్వతి ఘాట్ వరకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, రహదారుల్లో గుంతలు లేకుండా మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. పోలీసు, ఆర్ అండ్ బి శాఖలు సంయుక్తంగా రహదారుల పరిస్థితిని పరిశీలించి వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని అన్నారు. నదిలోకి వెళ్లేందుకు తాత్కాలిక మార్గాలు ఏర్పాటు చేయడంతో పాటు భద్రతా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం, సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంచడం కోసం మిషన్ భగీరథ అధికారులకు సూచనలు ఇచ్చారు. సిబ్బందికి వసతి సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని, వ్యర్థాల నిర్వహణ కోసం ట్రాక్టర్లు, శుభ్రత సామగ్రి సిద్ధంగా ఉంచాలని డిపిఓకు ఆదేశించారు. బస్ స్టాండ్ వద్ద విద్యుత్, ప్రయాణికుల కోసం షెడ్లు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. హారతి, దీపోత్సవం కార్యక్రమాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖకు సూచించారు. ఆలయాన్ని అందంగా అలంకరించడంతో పాటు విద్యుద్దీకరణ చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులకు రక్షణ బృందాలు ఏర్పాటు చేయడం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, రవాణా అధికారి సంధాని, వైద్య శాఖ అధికారి డా. మధుసూదన్, సాగునీటి శాఖ ఈఈ తిరుపతిరావు, అగ్నిమాపక అధికారి సతీష్ కుమార్, డిపిఓ శ్రీలత, ఆర్టీసీ డీఎం ఇందు, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, మిషన్ భగీరథ ఈఈ శ్వేత, పంచాయతీ రాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, మత్స్య శాఖ అధికారి విజయ్ కుమార్, దేవస్థానం ఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు శ్రేణులు సన్నద్ధం కావాలి

**- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**
**- సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో పిలుపు**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 5:ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పార్టీ శ్రేణులు ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. పెరుగుతున్న రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడంలో కమ్యూనిస్టుల బాధ్యత మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఐ కార్యవర్గ సమావేశం మంగళవారం పాల్వంచలోని శ్రీ లక్ష్మీ బ్యాంకెట్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ప్రజాస్వామ్యవాదులకు ఒక హెచ్చరికగా నిలిచాయని పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కమ్యూనిస్టు కార్యకర్తలు లోతైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మతోన్మాద శక్తులు విస్తరిస్తున్న తరుణంలో వాటిని అడ్డుకోవడం అత్యవసరమని, లౌకికవాదాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా పార్టీ కేడర్ అప్రమత్తంగా ఉండి ప్రజల పక్షాన నిలబడి పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. నిరంతర పోరాటాల ద్వారానే సామాన్య ప్రజల హక్కులను పరిరక్షించగలమని, ఐక్య పోరాటాల ద్వారా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే భవిష్యత్ కార్యాచరణకు ఎజెండాగా ఉండాలని, కమ్యూనిస్టు నాయకులు ఎప్పటికప్పుడు ప్రజల మధ్య ఉండి వారి విశ్వాసాన్ని పొందాలని అన్నారు. అప్పుడే పార్టీ బలమైన శక్తిగా ఎదగగలదని స్పష్టం చేశారు. సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా రాజకీయ నివేదికను ప్రవేశపెట్టారు. నరాటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు సరిరెడ్డి పుల్లారెడ్డి, సారయ్య, సలిగంటి శ్రీను, మున్నా లక్ష్మీకుమారి, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కమటం వెంకటేశ్వర్లు, ఆర్టీసీ భాస్కర్, భూక్యా దాసురు, ఉప్పుశెట్టి రాహుల్, మువ్వ వెంకటేశ్వర్లు, ఫహీం, శంకర్, బంధం నాగయ్యలు పాల్గొన్నారు.

# రైతులకు పాలకవర్గాన్ని ఎన్నుకునే హక్కును కాలరాయొద్దు : ఎస్.కె. సాబీర్ పాషా

## టిపిసిఎస్ ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలోనే నిర్వహించాలి





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 5:ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (టిపిసిఎస్) ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలోనే నిర్వహించాలని, నామినేటెడ్ విధానాన్ని అమలు చేయాలనుకోవడం అనాలోచిత నిర్ణయమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా పేర్కొన్నారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని కృతిక బ్యాంకెట్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిపిసిఎస్ ఎన్నికలను వెంటనే నిర్వహించి, వాటి ద్వారానే జిల్లా స్థాయిలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌కు, రాష్ట్ర స్థాయిలోని సహకార అపెక్స్ బ్యాంక్‌కు పాలకవర్గాలను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. సభ్యత్వ రుసుము చెల్లించి సంఘాల్లో సభ్యులుగా చేరిన రైతులకు తమ ప్రతినిధులను ఎన్నుకునే హక్కును ప్రభుత్వం హరించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకవర్గాల పదవీకాలాన్ని పదేపదే పొడిగించడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ఇప్పటికే రెండు సార్లు గడువు పొడిగించిన ప్రభుత్వం, మూడోసారి కూడా పొడిగించే ప్రయత్నం చేయడం, నామినేటెడ్ విధానాన్ని ప్రవేశపెట్టాలనుకోవడం సహకార వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని అన్నారు. టిపిసిఎస్‌కు తక్షణమే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, సిపిఐ అనుబంధ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ముత్యాల విశ్వనాథం, సారెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, కె. సారయ్య, సలిగంటి శ్రీను, మున్నా లక్ష్మీకుమారి, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కమటం వెంకటేశ్వర్లు, ఆర్టీసీ భాస్కర్, భూక్యా దాసురు, ఉప్పుశెట్టి రాహుల్, మువ్వ వెంకటేశ్వర్లు, ఫహీం, శంకర్, బంధం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నవ లిమిటెడ్ సహకారంతో నిర్మించిన వాక్సిన్ గది ప్రారంభం

## పాల్వంచ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రారంభించిన డీఎంహెచ్‌వో



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 5:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని శేఖర్ బంజర అర్బన్ హెల్త్ సెంటర్‌లో నవ లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం కింద నిర్మించిన వాక్సిన్ గదిని మంగళవారం జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణకుమారి మాట్లాడుతూ, టీకాల సమయంలో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నవ లిమిటెడ్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా, వారు తక్షణమే స్పందించి మూడు నెలల్లోనే వాక్సిన్ గదిని నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. ప్రధాన అతిథి డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో నిరీక్షణాలయం నిర్మాణం, కోవిడ్ కాలంలో కేంద్ర ఆక్సిజన్ వ్యవస్థ ఏర్పాటు వంటి కార్యక్రమాల ద్వారా నవ లిమిటెడ్ సంస్థ ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి చేస్తున్న కృషిని అభినందించారు. డీజీఎం సిహెచ్. శ్రీకాంత్ మాట్లాడుతూ సంస్థ ఆరోగ్యం, విద్య, జీవనోపాధి రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ సి. హెచ్. శ్రీనివాసరావు, సివిల్ ఇంజనీర్ ఫణీంద్రచారి, కరుణాకర్, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు, సిఎస్ఆర్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# ముస్తాబైన శ్రీ సీతారామాలయం

## ప్రారంభోత్సవానికి సిద్ధం... భక్తులను ఆహ్వానిస్తున్న పుల్లాయిగూడెం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 5:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పుల్లాయిగూడెం గ్రామంలోని శ్రీ సీతారామాలయం ప్రారంభోత్సవానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపిస్తూ భక్తులను ఆకర్షిస్తోంది. కొత్తగా నిర్మించిన ఈ ఆలయం శిల్పకళా సౌందర్యంతో ప్రత్యేకంగా నిలుస్తోంది. గోపురం నుంచి ప్రాంగణం వరకు విద్యుత్ దీపాలతో అలంకరించగా, పూలతోరణాలు, రంగవల్లులు ఆలయానికి మరింత శోభను చేకూరుస్తున్నాయి. రాత్రివేళల్లో వెలుగుల కాంతిలో ఆలయం అద్భుతంగా మెరిసిపోతోంది. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, యాగాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. యాగశాలలో శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించేందుకు అగ్నికుండాలు సిద్ధంచేయగా,పండితులు వేదమంత్రాల నడుమ కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు, కూర్చునే ఏర్పాట్లు కల్పించారు. తాగునీరు, ప్రసాదం పంపిణీ వంటి సౌకర్యాలు కూడా అందుబాటులో ఉంచారు. గ్రామస్తులు, యువకులు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ ఆలయ ప్రారంభోత్సవం పుల్లాయిగూడెం గ్రామానికి ఆధ్యాత్మికంగా కొత్త ఊపునిచ్చే కార్యక్రమంగా భావిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని అంచనా వేస్తూ, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దేవుని ఆశీర్వాదం పొందాలని కోరారు.




# బిఆర్ఎస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

## - కాళేశ్వరంపై సిబిఐ విచారణ ఎందుకు తొక్కి పెట్టారు - వరంగల్ రైతుమేళా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హనుమకొండ, మే 5 : బిఆర్ఎస్, బిజెపిలవి కుమ్మక్కు రాజకీయా లని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. బిఆర్ఎస్‌తో కుమ్మక్కు కాకపోతే కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదన్నారు. మోడీకి దమ్ముంటే తెలంగాణకు వచ్చేలోగా సిబిఐ విచారణకు ఆదేశించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని విమర్శించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా రైతులకు రూ.21వేల కోట్లు చెల్లించామని చెప్పారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వరి వేస్తే ఉరి అన్నారని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరివేసిన రైతులకు మద్దతు ధర కల్పిస్తూ.. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు.

'రైతులకు ఎకరానికి రూ.12వేల ఆర్థిక సాయంతోపాటు వ్యవసాయ పరికరాలు ఇస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌కు రూ.1200 కోట్లు చెల్లిస్తున్నాం. రైతును రాజు చేసే వరకు విశ్రమించబోము' అని పొంగులేటి అన్నారు.

# రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ రాములు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెటిపేట, మే 05 : కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం మిట్టపల్లిలో గల శ్రీరామ రైస్ మిల్, శివరామకృష్ణ రైస్ మిల్, గుల్లకోటలో గల శ్రీరామచంద్ర రైస్ మిల్ లను జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి సందర్శించి రైస్ మిల్లుల నిర్వహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి జాప్యం లేకుండా దిగుమతి చేసుకోవాలని తెలిపారు. జన్నారం మండలంలోని పొన్కల్, రెండ్లగూడ, మొర్రిగూడ, దండేపల్లి మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యము కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు నిబంధనల ప్రకారం తాలు, తప్ప, తేమ లేకుండా ధాన్యాన్ని తీసుకురావాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ఎఫ్ ఏ క్యూ నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు కనీస వసతి సౌకర్యాలు త్రాగునీరు, నీడ ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలలో అందుబాటులో ఉంచిన ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్లు, హస్క్ రిమూవర్స్, ఇతర సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జన్నారంలో గల వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ గోదామును పరిశీలించి మండల కేంద్రంలో గల రాఘవేంద్ర రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ల ట్రాప్ కేసులో సంచలన విషయాలు

## - ఇన్‌స్టా వేదికగా వల విసరి లోబర్చుకున్న బ్రదర్స్ - ఖరీదైన కార్లలో తిప్పుతూ అత్యాచారాలు - కేసులో ఆజాద్ తల్లి, మేనమామల అరెస్ట్ -వివరాలు వెల్లడించిన కమిషనర్ సజ్జన్నార్



హైదరాబాద్, మే 5 : జూబ్లీహిల్స్ బాలికల ట్రాప్, చీటింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములు.. 19 మంది మైనర్లను ట్రాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నిందితులను విచారించామని.. ఈ విచారణలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో మూడుగంటల పాటు నిందితులను సీపీ ప్రశ్నించారు. అర్జున్ అలియాస్ చంద్రశేఖర్ ఆజాద్, ప్రవీణ్‌లను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకున్నట్లు చెప్పారు. రిచ్ కిడ్స్‌ను అర్జున్, ఆయన సోదరుడు ప్రవీణ్ టార్గెట్ చేశారని సజ్జనార్ వెల్లడించారు. మైనర్లను ట్రాప్ చేసి ఖరీదైన కార్లలోనే లైంగిక చర్యలకు అర్జున్ పాల్పడ్డాడని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎస్కార్ట్‌గా ఉంటూ మైనర్లకు వల విసిరారని చెప్పారు. అర్జున్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో 150 మంది అమ్మాయిలు ఫాలో అవుతున్నారన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం అర్జున్ ప్రొఫైల్‌ను తాము లాక్ చేశామని తెలిపారు. ఇద్దరు నిందితులకు వారి తల్లి మీనాకుమారి కూడా సహకరించినట్లుగా గుర్తించామని అన్నారు. నిందితుల కుటుంబం గుంటూరుకు చెందినదిగా తమ దర్యాప్తులో తేలిందన్నారు. బాలికలు అట్రాక్ట్ అయ్యేలా ఇన్‌స్టాగ్రామ్‌లో అర్జున్ రీల్స్ చేశాడని అన్నారు. ఇక్కడి నుంచి బాలికలను ట్రాప్ చేసి రిచ్‌గా కారులో షికారు అంటూ హైదరాబాద్ రోడ్లపై అర్జున్ అన్నదమ్ములు తిప్పారని చెప్పారు. తమతో ఫిజికల్ రిలేషన్ పెట్టుకునేలా బాలికలపై ఒత్తిడి చేశారన్నారు. ఆ వీడియోలను కూడా నిందితులు రికార్డు చేశారని.. సమయం చూసి తాము ఓ బిజినెస్ మొదలుపెడతామని బాధితులను నమ్మించి డబ్బు అడిగేవారని తెలిపారు. అలా ఓ బాలిక ఇంట్లో తెలియకుండా రూ. 13 లక్షలను నిందితులకు ఇచ్చిందన్నారు. గత ఏడాది కూడా ఇలాగే మరో మైనర్‌ను అర్జున్ ట్రాప్ చేశారని తెలిపారు. ఈ కేసులో మూడు రోజుల పాటు జైల్లో ఉండి ఆయన బయటకు వచ్చారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇకపోతే యువతులను బెదిరించి డబ్బులు కాజేసిన ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఆజాద్ తల్లితోపాటు మేనమామను జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖరీదైన కార్లలో తిరుగుతున్న ఫొటోలను ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఆజాద్.. స్టార్టప్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. యువతులకు దగ్గరై.. ఫొటోలు బహిర్గతం చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఓ మైనర్ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో గత నెలలో ఆజాద్, అతడి సోదరుడిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో నాలుగు రోజులు కస్టడీకి తీసుకొని విచారించారు. మోసపోయిన వారిలో ఎక్కువ మంది మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. యువతుల నుంచి కాజేసిన సొమ్మును తల్లి, మేనమామ ఖాతాల్లో జమచేసినట్లు విచారణలో తేలింది. దీంతో తాజాగా వారిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

# దేశాభివృద్ధికి కీలక నిర్ణయాలు

## - రూ. 1,52,702 కోట్ల నిధుల మంజూరు - చెరుకు రైతుల కోసం లక్ష కోట్లు కేటాయింపు - మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద రూ. 5,659 కోట్లు - సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు - ఉన్నత న్యాయస్థానంలో మరో నలుగురు జడ్జిల పెంపు - కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 5 : దేశాభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా కేంద్ర క్యాబినెట్ ఇవాళ సంచలన నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పలు కీలక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు ఆమోదం తెలుపుతూ దాదాపు రూ. 1,52,702 కోట్ల నిధులను మంజూరు చేసింది. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, సెమీకండక్టర్ రంగాలకు ఈ నిధులను కేటాయించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం భారీ కేటాయింపులు చేసింది. చెరుకు రైతులకు తీపి కబురు అందించింది. 2026-27 సంవత్సరానికి గాను చెరుకు 'ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్' కోసం ఏకంగా రూ. 1 లక్ష కోట్లను కేటాయించింది. కాటన్ మిషన్.. పత్తి ఉత్పాదకతను పెంచేందుకు 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద రూ. 5,659 కోట్లు మంజూరు చేసింది. టెక్నాలజీ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్.. సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు కోసం ఈ సంస్థకు రూ. 3,068 కోట్లు కేటాయించారు. సుచి సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్.. మరో యూనిట్ కోసం రూ. 868 కోట్లు మంజూరు చేశారు. రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు మూడు కీలక మార్గాల్లో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. నగద - మథుర రైల్వే లైన్ నిర్మాణానికి రూ. 16,403 కోట్లు, గుంతకల్ - వాడి లైన్ నిర్మాణానికి రూ. 4,758 కోట్లు కేటాయించారు. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. బుర్వాల్ - సీతాపూర్ రైల్వే లైన్‌కు రూ. 2,276 కోట్లు కేటాయించారు. వీటితోపాటు మరికొన్ని ఇతర కీలక నిర్ణయాలను కేంద్ర క్యాబినెట్ తీసుకుంది. ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ కోసం రూ. 18,100 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. షిప్పింగ్ రంగం.. వడినర్‌లో ఓడల మరమ్మత్తుల సౌకర్యాల అభివృద్ధికి రూ. 1,570 కోట్లు కేటాయించారు. సుప్రీంకోర్టు బలోపేతం.. అత్యున్నత న్యాయస్థానం పనితీరును మరింత మెరుగుపరచడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఒక కీలక విధాన నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదించింది. దీంతోపాటు, సుప్రీంకోర్టులో మరో నలుగురు న్యాయమూర్తులను పెంచడానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో దేశ అత్యున్నత న్యాయస్థానంలో జడ్జిల సంఖ్య 33 నుంచి 37కు చేరుతుంది. ఈ భారీ కేటాయింపులు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, భారీగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

# రైతులను గోసపెడుతున్న కాంగ్రెస్

## - మక్కల కొనుగోలు కేంద్రాలు ఏవీ - 6న రైతు సదస్సు విజయవంతం చేయాలన్న చల్లా ధర్మారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)





వరంగల్, మే 5 : రైతులను కష్టాలపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి రైతుల గోస తగులుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. రుణమాఫీ కాలేదని, రైతు భరోసాను ఎగ్గొట్టారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా మక్కలు కొనడం లేదని, దీంతో రైతులు మండుటెండలో పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ఈ నెల 6న హనుమకొండలో నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని చల్లా ధర్మారెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం గూడెప్పాడు మార్కెట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి వారి సమస్యలు, కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న మోసాలను అడిగి తెలుసుకున్నారు. 20 రోజులు గడిచిన కాంటాలు పెట్టడంలేదని, ఏది చేయాలన్న డబ్బులు అడుగుతున్నారని, కనీసం తాగడానికి నీళ్లు కూడా మార్కెట్‌లో లేవని, అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే కాంటాలు పెడుతున్నారని రైతులు మాజీ ఎమ్మెల్యేకి తెలుపుతూ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో రైతులతో కలిసి గుడెప్పాడ్ క్రాస్ వద్ద మక్కలు కొనుగోలు చేయాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ..మక్కలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. గన్నీ బ్యాగులు ఇవ్వకుండా, కాంటాలైన బస్తాలు తరలించకుండా కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



# సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 5 : నిర్మల్ జిల్లాలోసిఎంఆర్ డెలివరీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా, మంగళవారం సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లులకు కేటాయించిన సిఎంఆర్ లక్ష్యాలను పూర్తిచేయాలని అన్నారు. సిఎంఆర్ కు సంబంధించిన వివరాలను మిల్లర్ల వారిగా సమీక్షించారు. సిఎంఆర్ డెలివరీలో వెనుకబడిన మిల్లర్లు, ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. అన్ని మిల్లులలో, మిల్లులకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రికార్డుల నిర్వహణకు సంబంధించి అధికారులు, మిల్లర్లకు అవగాహన కల్పించాలని వివరించారు. సీఎంఆర్ ప్రక్రియలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వరి ధాన్యపు సంచులు ఉంచడానికి తగిన గోదాములు ఇతరత్రా ప్రదేశాలు అన్వేషించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే లారీల ద్వారా ధాన్యపు సంచులను తరలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ధాన్యపు సంచులు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకూడదన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, మేనేజర్ సుధాకర్, రైస్ మిల్లర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అడవుల సంరక్షణలో కార్యోన్ముఖులు కావాలి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 5: అడవుల సంరక్షణలో కార్యోన్మకులు కావాలని జిల్లా అటవీ శాఖ అధికారిని బాలమణి సూచించారు. జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు యోగేష్ కులకర్ణి ఆధ్వర్యంలో డిఎఫ్ఓను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవుల సంరక్షణలో సిబ్బంది నిరంతరం కృషి చేయాలన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సిబ్బందికి అన్నివేళలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సద్దాం హుస్సేన్, సాయి చరణ్, స్వప్న, అనిల్ పాల్గొన్నారు.

# రైతులకు ఉరితాళ్ళు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




రామగుండం, మే 5: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు వారికి మెడ ఉరితాళ్లుగా మారాయని అఖిలభారత రాష్ట్ర రైతు సంఘం కమిటీ సభ్యులు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి వెంకన్న ఆరోపించారు. మంగళవారం అంతర్గాం మండలం సోమనపల్లి రైతు వేదిక వద్ద ఈనెల 11, 12, 13 లో తేదీలలో భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లందులో నిర్వహించే అఖిలభారత ఐక్య రైతు సంఘం మహాసభల గోడపోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు చేస్తున్నదగా తెస్తున్న చట్టాల విధానాలపై చర్చించేందుకు అఖిలభారతస్థాయి మహాసభలో రైతు పక్షపాతి వడ్డే శోభనాదీశ్వరరావు, ప్రదీప్ సింగ్ ఠాకూర్, ఇల్లందు మాజి ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పాటు రంగారావు, అరుణక్క తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. మొదటిరోజు బహిరంగ సభ ప్రదర్శన 25 వేల మందితో జరుగుతుందని, రెండవ రోజు ప్రతినిధులు 16 రాష్ట్రాల నుంచి హాజరవుతారని, మహాసభకు రైతు సోదరులు ప్రజాస్వామ్యవాదులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని వెంకన్న కోరారు. ఈ కార్యక్రమంలో తీగుట్ల రామన్న, బరుపటి చిన్న లచ్చన్న, అల్వాల లచ్చయ్య, కందుల చంద్రయ్య, నూనె వెంకటి, మల్లయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన డా.రవికాంతరావుకు ఘన సన్మానం

## - జిల్లా విద్యాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయం - ప్రభుత్వ పర్యావరణ రక్షణ "వాల్టా"అథారిటీ రాష్ట్ర సభ్యుడు గుండేటి యోగేశ్వర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మంచిర్యాల, మే 5: తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర విద్యా సాంకేతిక సంస్థ (ఎస్ఐఈటి) ప్రొఫెసర్ డా. కె. రవికాంతరావు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లోని వయోజన విద్యా కార్యాలయానికి వచ్చిన ఆయనను రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ రక్షణ "వాల్టా" అథారిటీ రాష్ట్ర సభ్యుడు, పర్యావరణవేత్త, జిల్లా విద్యాశాఖ రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పమాల, శాలువా, సన్మాన పత్రాన్ని అందజేసి ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. డా. రవికాంతరావు అందించిన ప్రోత్సాహం జీవితంలో మరువలేనిదని యోగేశ్వర్ పేర్కొన్నారు. అలాగే మంచిర్యాల జిల్లా తొలి విద్యాశాఖ అధికారిగా జిల్లా విద్యాభివృద్ధికి డా. రవికాంతరావు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. అనంతరం డా. రవికాంతరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం గుండేటి యోగేశ్వర్ నిరంతరం అందిస్తున్న సేవలను ప్రత్యేకంగా అభినందించారు. "ప్రకృతి మిత్ర" సంస్థ ద్వారా రాష్ట్రస్థాయిలో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు.



# మాజీ కేంద్ర మంత్రి హంసరాజ్ గంగారాం కు సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 5: మాజీ కేంద్రమంత్రి హంస రాజ్ ఆహిర్ ను మంగళవారం టీఏసి రాష్ట్ర సభ్యులు విశాల్ కాంద్రె ఆహిర్ ను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో మూడు రాష్ట్రాలు బిజెపి కైవసం చేసుకోవడం జరిగిందనీ ముఖ్యంగా బెంగాల్ ఎన్నికల్లో విజయం సాధించడం పట్ల కేంద్ర మంత్రివర్యులు హంసరాజ్ హహిర్ కృషి ఎంతో ఉంది అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో వారి బహిరంగ సభను అడ్డుకోవడం జరిగింది అప్పుడు మమతా బెనర్జీ భారతియ జనతా పార్టీ అంటే నీకెందుకు భయం ఆమెకు బహిరంగంగా ఆన్సర్ రాజ్ సవాల్ చేయడం ప్రజలే నీకు సరైన సమయంలో సరైన గుణపాఠం చెప్తారు అని ప్రజలకే తప్పు చేసి ఉంటే మాత్రమే భయపడాలని వారు చెప్పడం జరిగింది అనంతరం వారు ఎన్సీబీసీ చైర్పర్సన్ సమయంలో బంగ్లాదేశ్ నుండి అక్రమ చొరబాటు దార్లను ఆధార్ కార్డు ఓటర్ ఐడి కార్డ్ మమత సర్కార్ ఇచ్చి వాళ్లను పోషించడం లాంటి స్కాంలను బయటికి తీసిన ఘనత హంసరాజ్ దేనని చోరబాటు దారులను పైకి తీయడంతో ఈ ఫలితం లో భారతీయ జనతా పార్టీకి మద్దతు కావడం జరిగింది.

# సినిమా న్యూస్



బాక్సాఫీస్ వద్ద రజనీకాంత్ మేజిక్ చేస్తే ఎలా ఉంటుందో మూడేళ్ళ క్రితం 'జైలర్' సినిమా నిరూపించింది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో వచ్చిన ఆ చిత్రం అప్పట్లో ఒక సంచలనం. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో జైలర్ సృష్టించిన వండర్స్ అంతా ఇంతా కాదు. ఆ సినిమా ఇచ్చిన జోష్‌తోనే ఇప్పుడు ఈ క్రేజీ కాంబినేషన్‌లో సీక్వెల్ రాబోతోంది. అయితే 'జైలర్ 2' అనౌన్స్‌మెంట్ వచ్చిన దగ్గరి నుంచి బిజినెస్ లెక్కల విషయంలో ట్రేడ్ వర్గాల్లో పెద్ద చర్చే నడుస్తోంది. సీక్వెల్ అనగానే రేట్లు పెరగడం సహజమే కానీ, ఈసారి మేకర్స్ కోట్ చేస్తున్న తెలుగు స్టేట్స్ ఫిగర్ చూసి బయ్యర్లు కొంత వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జైలర్ 2 రైట్స్ కోసం దాదాపు 60 కోట్ల రూపాయల వరకు మేకర్స్ డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. గతంలో జైలర్ మొదటి భాగం కేవలం 12 కోట్ల బిజినెస్ చేసి, తెలుగులో ఏకంగా 50 కోట్లకు పైగా షేర్ వసూలు చేసింది. ఆ లెక్కన చూస్తే 60 కోట్లు పెద్ద విషయం కాదనిపించవచ్చు. కానీ జైలర్ తర్వాత రజనీకాంత్ నుంచి వచ్చిన లాల్ సలామ్, వేట్టయన్, కూలీ వంటి సినిమాలు తెలుగులో బయ్యర్లకు నష్టాలను మిగిల్చాయి. అందుకే ఈసారి అంత భారీ మొత్తాన్ని పెట్టి రిస్క్ చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని ఇండస్ట్రీ టాక్.

మరోవైపు ఈ సినిమాలో నందమూరి బాలకృష్ణ ఒక కీలక పాత్రలో కనిపిస్తారనే ప్రచారం జోరుగా సాగింది. ఒకవేళ బాలయ్య కన్ఫర్మ్ అయితే తెలుగులో 60 కోట్లు వసూలు చేయడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ బాలయ్య ఈ ప్రాజెక్ట్‌కు నో చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో బిజినెస్ డీల్స్ మళ్ళీ మొదటికి వచ్చాయి.

## రజినీ సినిమా.. ఎందుకు కొనట్లేదు?

కేవలం రజనీకాంత్ ఇమేజ్ మీద మాత్రమే ఆధారపడి ఇంత భారీ రేటు చెల్లించడం కంటే, సినిమాపై బజ్ పెరిగే వరకు వేచి చూడాలని బయ్యర్లు డిసైడ్ అయ్యారట.

ఒకవేళ అనుకున్న రేటుకు రైట్స్ అమ్ముడుపోకపోతే, గతంలో లాగే సన్ పిక్చర్స్ సంస్థ దిల్ రాజు లేదా సురేష్ బాబు వంటి పెద్ద డిస్ట్రిబ్యూటర్ల ద్వారా కమిషన్ బేసిస్ మీద రిలీజ్ చేసే అవకాశం ఉంది. రజనీకాంత్ సినిమాకు తెలుగులో మంచి మార్కెట్ ఉన్నప్పటికీ, అది కంటెంట్ మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. జైలర్ మొదటి భాగం ట్రిపుల్ బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడానికి కారణం అందులోని మ్యాజిక్, ఎలివేషన్స్. సీక్వెల్‌లో కూడా అదే స్థాయి ఇంటెన్సిటీ ఉంటే తప్ప 60 కోట్ల బ్రేక్ ఈవెన్ సాధించడం అంత సులభం కాదు. ఆగస్టులో రిలీజ్ ప్లాన్ చేస్తున్న ఈ సినిమాకు సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి అఫీషియల్ అప్‌డేట్ లేకపోవడం కూడా బయ్యర్లలో కొంత అయోమయాన్ని కలిగిస్తోంది. రజనీ నెల్సన్ కాంబో మళ్ళీ మ్యాజిక్ రిపీట్ చేస్తుందని ఫ్యాన్స్ నమ్మకంగా ఉన్నా, వ్యాపార పరంగా మాత్రం లెక్కలు తేలడం లేదు. రైట్స్ కోసం కోట్ చేసిన ఆ డీల్ వర్కవుట్ అవుతుందా లేక మేకర్స్ కొంత తగ్గుతారా అనేది చూడాలి.




## సెన్స్ ఆఫ్ హ్యూమర్ అంటే అల్లు అర్జునే! లావణ్య మాటలు వైరల్



మెగా కుటుంబంలో కోడలిగా అడుగుపెట్టిన తర్వాత కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తున్నారు హీరోయిన్ లావణ్య త్రిపాఠి. అందాల రాక్షసితో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి, తన సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న లావణ్య, కెరీర్ ప్రారంభం నుంచే కథా ప్రధాన సినిమాలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగారు. తర్వాత పలు సక్సెస్‌ఫుల్ సినిమాల్లో నటించిన ఆమె, మిస్టర్ సినిమా టైమ్ లో తన కో యాక్టర్ వరుణ్ తేజ్ తో ఏర్పడిన స్నేహం, తర్వాత ప్రేమగా ఆ తర్వాత వివాహ బంధంగా మారింది. పెళ్లి తర్వాత కూడా లావణ్య సినిమాల్లో కొనసాగుతూ వస్తున్నారు. ప్రస్తుతం లావణ్య ప్రధాన పాత్రలో తెరకెక్కిన సతీ లీలావతి సినిమా రిలీజ్ కు సిద్ధమవుతోంది. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో డైరెక్టర్ తాతినేని సత్య తెరకెక్కించిన ఈ సినిమా మే 8న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రిలీజైన ట్రైలర్ మంచి రెస్పాన్స్ ను రాబట్టగా, ఈ సినిమాతో లావణ్య మరోసారి తన నటనతో ఆకట్టుకునే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ట్రైలర్‌ను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రిలీజ్ చేయడం కూడా సినిమాపై హైప్‌ను పెంచింది. ఇది మెగా కుటుంబం నుంచి లావణ్యకు లభిస్తున్న మద్దతుకు నిదర్శనంగా చెప్పొచ్చు.

ఇక వ్యక్తిగతంగా మెగా మరియు అల్లు కుటుంబ సభ్యులతో లావణ్యకు మంచి అనుబంధం ఉన్న విషయం తెలిసిందే. లావణ్య ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. సెన్సాఫ్ హ్యూమర్ విషయంలో ఎవరి నుంచి నేర్చుకోవాలనుకుంటారనే ప్రశ్నకు లావణ్య ఎలాంటి సందేహం లేకుండా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పేరును ప్రస్తావించారు. ఆయనకు ఉన్న టైమింగ్, సెన్సాఫ్ హ్యూమర్ తనకు చాలా ఇష్టమని, అలాంటి క్వాలిటీ ఎవరికైనా ఉండాలి అనిపిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చలకు దారి తీశాయి. మెగా కుటుంబంలోనే పలువురు స్టార్ హీరోలు ఉన్నప్పటికీ, లావణ్య అల్లు అర్జున్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించడం గమనార్హం. దీని వల్ల ఆమెకు అల్లు కాంపౌండ్‌తో కూడా సమానంగా అనుబంధం ఉందనే అభిప్రాయం బలపడుతోంది. సోషల్ మీడియాలో అభిమానులు కూడా ఈ విషయాన్ని హైలైట్ చేస్తూ, లావణ్యకు రెండు కుటుంబాల నుంచి కూడా మంచి సపోర్ట్ లభిస్తోందని కామెంట్లు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే, లావణ్య త్రిపాఠి వ్యక్తిగత జీవితం, కుటుంబ అనుబంధాలు, అలాగే కెరీర్ ఎంపికలు.. ఈ మూడు అంశాల్లోనూ సమతుల్యతను కాపాడుకుంటూ ముందుకు సాగుతున్నారు. సతీ లీలావతి రిలీజ్ తర్వాత ఆమె కెరీర్‌లో కొత్త మలుపు తిరుగుతుందా అనే ఆసక్తి ఇప్పుడు సినీ అభిమానుల్లో నెలకొంది.

## మెట్ గాలా ఈవెంట్లో మామిడి పండు మెరుపులు



వేసవిలో మామిడి పండు రుచులు చూడని వారు లేరు. అలాంటి మామిడి పండు ఇప్పుడు మెట్ గాలా -2026 ఫ్యాషన్ ఈవెంట్లో ప్రధాన ఆకర్షణగా మారింది. ఇది ఎంపిక చేసుకున్న డిజైన్‌లో ఇమిడిపోయి ఆ దుస్తులు ధరించిన వ్యక్తికి ప్రత్యేకతను ఆపాదించింది. ఇంతకీ మెట్ గాలా ఈవెంట్లో మ్యాంగ్ యాక్సెసరీని ధరించిన ఆ యువతి ఎవరు? అంటే.. ప్రపంచ కుబేరుడు ముఖేష్ అంబానీ కుమార్తె ఈషా అంబానీ. పూర్తి వివరాల్లోకి వెళితే.. సాధారణంగా వేసవి కాలం వచ్చిందంటే చాలు అందరికీ గుర్తుకు వచ్చేది మామిడి పండు రుచి. అయితే 2026 మెట్ గాలా ఫ్యాషన్ ఈవెంట్‌లో ఈ మామిడి పండు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతర్జాతీయ ఫ్యాషన్ వేదికపై ఒక కళాకృతిగా మారి అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రపంచ కుభేరుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ కుమార్తె ఈషా అంబానీ ఈ మెట్ గాలా వేడుకలో తన వస్త్రధారణతో ప్రపంచ దృష్టిని ఆకర్షించడమే కాకుండా.. భారతీయ సంస్కృతిని.. వ్యక్తిగత సెంటిమెంట్లను మేళవించి ఒక కొత్త ఒరవడిని సృష్టించారు. ఈషా ధరించిన దుస్తుల్లో దాగి ఉన్న మామిడి పండు యాక్సెసరీ ఇప్పుడు ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈషా అంబానీ తన చేతిలో పట్టుకున్న ఆ మామిడి పండు నిజమైన పండు కాదు. అది ప్రముఖ కళాకారుడు సుబోధ్ గుప్త రూపొందించిన 20 ఏళ్ల నాటి ఒక అరుదైన శిల్పం (స్కల్ప్చర్). కేవలం ఫ్యాషన్‌ను ప్రదర్శించడమే కాకుండా.. భారతీయ కళాకారుల ప్రతిభను అంతర్జాతీయ వేదికపై గౌరవించడం ఈషా లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రఖ్యాత డిజైనర్ గౌరవ్ గుప్తా రూపొందించిన అద్భుతమైన చేనేత చీర శిల్పకళా శైలిలో ఉన్న కేప్ తనకు ఒక రాచరికపు రూపాన్ని అందించాయి. ఈ వస్త్రధారణ ఆధునికతకు.. భారతీయ చేనేత కళకు నిలువుటద్దంగా నిలిచింది. ఈషా ధరించిన బ్లౌజ్ కేవలం అలంకరణకు మాత్రమే పరిమితం కాలేదు.. దాని నిండా ఎన్నో భావోద్వేగపూరితమైన అంశాలు ఉన్నాయి. తన తల్లి నీతా అంబానీకి సంబంధించిన మధుర జ్ఞాపకాలను ఈ బ్లౌజ్ డిజైన్‌లో పొందుపరిచినట్లు ఈషా వెల్లడించారు. తల్లిపై ఉన్న ప్రేమాభిమానాలను ప్రతిబింబించేలా ఈ బ్లౌజ్ రూపొందించడం విశేషం. గ్లోబల్ రెడ్ కార్పెట్‌పై నడుస్తున్నప్పుడు కూడా మన మూలాలను.. అమ్మ జ్ఞాపకాలను వెంట తీసుకెళ్లడం ఈషా వ్యక్తిత్వానికి అద్దం పడుతోంది. వస్త్రధారణలో వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సెంటిమెంట్లను జోడించడం ఈషా అంబానీ లుక్‌కు మరో ప్రత్యేకతను తెచ్చింది. తన పిల్లలు పుట్టినప్పుడు బహుమతులుగా అందిన కొన్ని అరుదైన వస్తువుల భాగాలను కూడా ఈ బ్లౌజ్ డిజైన్‌లో చేర్చారు. ఒక తల్లిగా తన అనుభూతులను.. కుటుంబ బంధాలను ఇలా ఫ్యాషన్ రూపంలో ప్రపంచానికి చూపించడం అందరినీ ఆకట్టుకుంది. దీనివల్ల తను ధరించిన డ్రెస్ కేవలం ఒక దుస్తుల జతగా కాకుండా.. ఒక జ్ఞాపకాల అరలా మారిపోయింది. మెట్ గాలా 2026 వేదికపై ఈషా అంబానీ ప్రదర్శించిన ఫ్యాషన్ ఒక సంపూర్ణ కళాఖండం అని చెప్పవచ్చు.

## తల్లైనా ఆ హీరోయిన్ ఇప్పటికీ అమ్మ కూచీనే!



సినీ పరిశ్రమలో కథానాయికల ప్రయాణం వెనుక వారి తల్లుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుంది. కెరీర్ ప్రారంభంలో కూతురిని వెన్నంటి ఉంటూ షూటింగ్ స్పాట్‌లలో వారికి రక్షణగా తోడుగా నిలిచే తల్లులను తరచుగా చూస్తుంటాం. అయితే హీరోయిన్ ఒక స్థాయికి చేరుకున్నాక లేదా వివాహం చేసుకున్న తర్వాత సాధారణంగా మదర్ సపోర్ట్' అనేది ఇంటికే పరిమితమవుతుంది. కానీ బాలీవుడ్ నటి యామీ గౌతమ్ విషయంలో మాత్రం ఇది పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. తాను తల్లిగా మారినా? ఇప్పటికీ తన తల్లికి అమ్మకూచీనే అని గర్వంగా చెబుతోం ది. యామీ గౌతమ్ వృత్తిపరమైన బాధ్యతలను - వ్యక్తిగత జీవితాన్ని ఎంతో సమర్థవంతంగా బ్యాలెన్స్ చేయగలు గుతున్నారంటే? దానికి ప్రధాన కారణం ఆమె తల్లి అని అంటున్నారు. సాధారణంగా నటీమణులు పెళ్లి చేసుకున్న తర్వాత వారి తల్లుల ప్రమేయం తగ్గుతుంది. కానీ యామీ గౌతమ్ విషయంలో ఆమె తల్లి ఇల్లు, పిల్లల బాధ్యతలతో పాటు అన్ని విషయాల్లో చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. ఈ బలమైన పునాది ఉండటం వల్లే తాను కెరీర్‌లో ఎలాంటి ఒత్తిడి లేకుండా సంతోషంగా కొనసాగుతున్నానంది. చాలామంది హీరోయిన్ల తల్లులు తమ కూతుళ్లు పెద్ద స్టార్స్ అయ్యే వరకూ మాత్రమే మేనేజర్లుగా , గార్డియన్లుగా వ్యవహరిస్తారు. కానీ యామీ గౌతమ్ తల్లి మాత్రం మానసిక స్థైర్యంగా మారారు. షూటింగ్ షెడ్యూల్స్ వల్ల బిజీగా ఉన్న సమయంలో ఇంటి బాధ్యతలను తల్లి భుజాన వేసుకోవడం వల్లే తాను నటనపై పూర్తి దృష్టి పెట్టగలుగుతున్నానని యామీ కృతజ్ఞతా భావం వ్యక్తం చేసింది. ఇది కేవలం సహాయం మాత్రమే కాదని ఒక తల్లి తన బిడ్డపై చూపే అంతులేని ప్రేమకు నిదర్శనమని అంటోంది. ఒక మహిళ తన కెరీర్‌లో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలంటే కుటుంబ మద్దతు ఎంత అవసరమో యామీ మాటలు ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా సినీ పరిశ్రమ వంటి సవాలుతో కూడిన రంగంలో ఇంటి దగ్గర నమ్మకమైన వ్యక్తులు ఉన్నప్పుడే ప్రశాంతంగా పని చేయగలుగుతారు.

యామీ తల్లి ఆమెకు కేవలం తల్లిగానే కాకుండా మంచి స్నేహితురాలిగా, మార్గదర్శిగా ఉంటూ ప్రతి అడుగులోనూ తోడుగా నిలుస్తున్నారు.

## హైదరాబాద్‌లో బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్

మొదటిపేజీ తరువాయి

మంగళవారం నాడు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ ల సమక్షంలో బిఎఎస్ ఎఫ్ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు టోబియాస్ డ్రాట్ తెలంగాణ లైఫ్‌సైన్సెస్ సీఈఓ సర్వేశ్ సింగ్ కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేసారు. సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈ ఏడాది 100 జిసిసిల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. వీటి ద్వారా లక్ష మంది ఐటి నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. హైదరాబాద్ కేవలం కార్యాలయాల కేంద్రంగా మాత్రమే కాకుండా, ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ రంగాల్లో ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా కృత్రిమ మేథస్సు ఆధారిత కేంద్రం ఐకామ్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, 200 ఎకరాల్లో ఏఐ సిటీ, క్వాంటమ్ హబ్, జీవ విజ్ఞాన పరిశోధన్ సంస్థ '1 బయోల్యాబ్' లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. 160 సంవత్సరాల చరిత్ర కలిగిన బిఎఎస్ ఎఫ్ ప్రపంచవ్యాప్తంగా 200కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 234 కర్మాగారాలు, 1,08,000 మంది ఉద్యోగులతో పనిచేస్తున్న ఈ సంస్థ వార్షిక ఆదాయం దాదాపు 5 లక్షల కోట్ల రూపాయలు (60 బిలియన్ డాలర్లు). ప్రపంచంలోని పలు నగరాలతో పోటీ పడి హైదరాబాద్ ఈ ప్రతిష్ఠాత్మక అవకాశాన్ని దక్కించుకోవడం రాష్ట్రానికి దక్కిన గౌరవం. న్విడియా, మైక్రోసాఫ్ట్, గూగుల్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, మారియట్ ఇంటర్నేషనల్ లాంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ జిసిసిలు ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయని శ్రీధర్ బాబు తెలిపారు.

## నేను ఓడిపోలేదు రాజీనామా చేయను

మొదటిపేజీ తరువాయి

బిజెపిలపై ఘాటు విమర్శలు చేశారు. బిజెపి కనుసన్నల్లో ఇసి పనిచేసిందన్నారు. అమిత్ షా, ప్రధాని మోడీలు కలసి కుట్రలు చేశారని మండిపట్టారు. 'ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీ చేశారు' అని మమత ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు పోలింగ్ ముగిసిన తర్వాత కూడా 80 నుంచి 90 శాతం కంటే ఎక్కువ బ్యాటరీని కలిగి ఉండటం ఏమిటని ప్రశ్నించారు. పోలింగ్‌కు రెండ్రోజుల ముందే అధికారులు తమ పార్టీపై దాడులు, కార్యకర్తల అరెస్టులు చేశారని అన్నారు. భవనీపూర్‌లో ఉద్దేశపూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగ పరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని అన్నారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించారనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని100సీట్లవరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. ఈ మొత్తం ఉదంతంలో 'ఇండి' కూటమి తన వైపే ఉందని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తనతో మాట్లాడారని, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, హేమంత్ సోరెన్ తదితరులు ఫోను చేసి సపోర్ట్‌గా నిలిచారని చెప్పారు. 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు.

## బెంగాల్, అసోంలలో ఓట్ చోరీ

మొదటిపేజీ తరువాయి

సంబంధించిన విషయం కాదు. దేశ అస్తిత్వానికి సంబంధించిన సమస్య' అని ఆయన పేర్కొన్నారు. విపక్ష పార్టీల మధ్య అనైక్యత పెరుగుతున్న నేపథ్యంలో.. అది బీజేపీకి వరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలు దేశ ప్రజాస్వామ్య వినాశనానికి సంకేతాలుగా పరిగణించాల్సిన అవసరం ఉందని రాహుల్ హెచ్చరించారు. విపక్షాలు పరస్పర విభేదాలను తగ్గించి, ప్రజాస్వామ్య రక్షణ కోసం ఒకే వేదికపైకి రావాలని సూచించారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా రాజకీయ పార్టీలన్నీ బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

## తమిళనాట కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కసరత్తు

మొదటిపేజీ తరువాయి

స్టేడియంలో ప్రమాణస్వీకర కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అనూహ్యంగా 108 స్థానాల్లో విజయం సాధించిన ప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 118 సీట్లను దక్కించుకోలేక పోయింది. మెజారిటీకి మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంది. టీవీకే సారథ్యంలోని ప్రభుత్వానికి మద్దతిచ్చేం దుకు కాంగ్రెస్ పార్టీ సుముఖంగా ఉందని వినిపిస్తోంది. వామపక్ష పార్టీలు సైతం టీవీకే నేతలతో సంప్రదింపులు సాగించనున్నట్టు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్-5, వీసీకే-2, సీపీఐ-2, సీపీఎం-2 సీట్లు గెలుచుకు న్నాయి. ఐయూఎంఎల్, డీఎండీకే, పీఎంకే పార్టీలను నుంచి కూడా టీవీకేకు మద్దతు లభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. కాగా, ప్రభుత్వం ఏర్పాటుకు తమను ఆహ్వానించా ల్సిందిగా గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌కు విజయ్ మంగళవారంనాడు లేఖ రాసినట్టు తెలుస్తోంది. మెజారిటీ నిరూపించు కునేందుకు రెండు వారాలు గడువివ్వాలని ఆ లేఖలో కోరినట్టు సమాచారం. మరోవైపు, ఓటమి నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన పదవికి రాజీనామా చేశారు. గవర్నర్‌ను కలిసి రాజీనామా పత్రాన్ని సమర్పించారు. దానిని గవర్నర్ వెంటనే ఆమోదిం చారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేంత వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని స్టాలిన్‌ను గవర్నర్ కోరారు.

## మమత వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం

మొదటిపేజీ తరువాయి

వచ్చారని వ్యాఖ్యానిం చారు. ఇంకా భరించరని, రాజ్యాంగ విరుద్ధ ప్రకటనలు చేయడం ద్వారా ఆమె నైజం ఏమిటో మరోమారు తెలిసిందన్నారు. ఓటమి తరవాత హుందాగా ఒప్పుకుని రాజీనామా చేయాల్సింది పోయి, ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చట్టం ఒప్పుకోదన్నారు. మూడు సార్లు అధికారంలో కొనసాగిన మమతా బెనర్జీ తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై మంగళవారంనాడు మీడియా సమావేశం లో ఘాటుగా స్పందించారు. బెంగాల్‌లో తాను బీజేపీతో పోరాడ లేదని, ఆ పార్టీ కోసం పనిచేసిన ఎన్నికల సంఘంతో పోరాడా నని, తన జీవితంలో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదని అన్నారు. ప్రధాని ఎన్నికల కమిషనర్‌ను 'విలన్'గా పేర్కొన్నారు. ఎన్నికల సంఘంతో కలిసి బీజేపీ గేమ్ ఆడిందని, 100 స్థానాలను బీజేపీ లూటీ చేసిందని అన్నారు. ఇది తమ ఓటమి కాదని, అందువల్ల రాజీనామా చేయనని, రాజ్‌భవన్‌కు వెళ్లనని చెప్పారు. మతాబెనర్జీ రాజీనామాకు నిరాకరిస్తే రాష్ట్రపతి పాలన అమల్లోకి తెచ్చే అవకాశాలుండవచ్చని వినిపిస్తుండగా, ఆ అవసరం లేదని ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ఎన్నికల గడువు ముగియడానికి ముందే గెలిచిన పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా గవర్నర్ ఆహ్వానిస్తే చాలని పేర్కొన్నాయి. పశ్చిమబెంగాల్ ప్రస్తుత అసెంబ్లీ గడువు మే 7తో ముగియనుంది. అయితే రెండ్రోజుల తర్వాత మే 9న కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి బీజేపీ సన్నాహాలు చేస్తోంది.

## కాళేశ్వరం అవినీతిపై చర్యలేవీ

మొదటిపేజీ తరువాయి

ఏడుస్తు న్నారని.. వారి విషయంలో ప్రభుత్వానికి మానవత్వం లేదని కేంద్ర మంత్రి విరుచుకుపడ్డారు. ఎంతమంది చనిపోతే రేవంత్ రెడ్డి కళ్లు చల్లబడతాయంటూ వ్యాఖ్యానించారు. కొనుగోళ్లు వెంటనే జరపాలని..కోత పెడితే ఊరుకోమని హెచ్చరించారు. ప్రధాని మోదీ వస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవన్నారు. మోదీని చూసి రేవంత్ రెడ్డి భయపడుతున్నారంటూ బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

## శాసనసభా పక్ష నేతగా విజయ్ ఎన్నిక

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ.. రాజకీయపరంగా ఆత్మగౌరవం విషయంలో తమ పార్టీ రాజీపడబోదన్నారు. పొత్తు విషయంలోనూ తమ పార్టీ స్పష్టమైన వైఖరితో ఉందని ఆ పార్టీ నేతలు తెలిపారు. అధికారం చేపట్టేందుకు అవసరమైన మద్దతు కోసం తమ పార్టీ ఎవరినీ అడుక్కోబోదని తెలిపారు. ఇక, మెజారిటీ నిరూపించుకునేందుకు టీవీకే నేతలు గవర్నర్‌ను కలిసి 15 రోజుల సమయం కోరారు. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో టీవీకే 108 సీట్లు సాధించి, అతిపెద్ద పార్టీగా మారింది. అధికారం చేపట్టాలంటే మరో 10 సీట్లు అవసరం. టీవీకేకు 35 శాతం ఓట్లు పోలయ్యాయి. మరోవైపు కాంగ్రెస్‌తో పొత్తు కోసం టీవీకే ప్రయత్నిస్తోందని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు కాంగ్రెస్‌తో రాయబారం నడుస్తోందని తెలుస్తోంది. విజయ్ తండ్రి చంద్రశేఖర్ కూడా కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారు. విజయ్ పార్టీ టీవీకే అధికారం చేపట్టాలంటే పొత్తు పెట్టుకోక తప్పని పరిస్థితి. విజయ్ ఎవరితో పొత్తువైపు మొగ్గు చూపుతారో తెలియాలి.

## ప్రధాని పర్యటనలో భారీ భద్రత

మొదటిపేజీ తరువాయి

బహిరంగసభలో పాల్గొననున్నారు. అందుకు అనుగుణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్తే ఏర్పాట్లు చేయాలని పోలీసుశాఖకు ప్రధాన కార్యదర్శి సూచించారు. బేగంపేట్ విమానాశ్రయం, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని ఫైర్ సర్వీసెస్ శాఖ అధికారులను, అవసరమైన వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు

## మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

మొదటిపేజీ తరువాయి

తీసుకువచ్చారు. 15 నుంచి 20 రోజులుగా ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కేటీఆర్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అలాగే మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.22,000 కోట్ల అప్పులు తీసుకువచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాల కారణంగా అక్కడి నుంచి నిధులు రాకపోవడంతో, మార్క్‌ఫెడ్ నిధులను వాడుకుంటున్నారని చెప్పారు. తాను చెప్పిన లెక్కలు తప్పైతే ప్రభుత్వం రుజువు చేయాలని సవాల్ విసిరారు. రైతులను ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, రేపటి వరకు గడువు ఇస్తున్నామని తెలిపారు. లేకపోతే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

## కాళేశ్వరంపై సిబిఐ విచారణ ఎందుకు చేయరు

మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్టు విషయం లో సీబీఐ దర్యాప్తుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. బండి సంజయ్ కేంద్ర మంత్రి అనే ఫీలింగే రావటం లేదని చెప్పారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. వేల కోట్ల అవినీతికి పాల్పడిందని విమర్శించారు. అలాగే రూ. వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ అవినీతిపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ పలుమార్లు ఆరోపణలు చేశారని.. అలాగే సీబీఐ విచారణను కోరారని గుర్తు చేశారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టి 8 నెలల క్రితం ఈ కేసును సీబీఐకు బదిలీ చేశామని పేర్కొన్నారు. బండి సంజయ్.. చేతిలోని తుపాకీ కాల్చకుండా కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే లాభం ఏమిటి? అంటూ టీపీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నించారు. బండి సంజయ్ లోపాయికారీ ఒప్పందంలో ఉండి ఈ దర్యాప్తునకు అడ్డుపడు తున్నారని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు లేకుండానే బీజేపీకి ఓట్లు పడ్డాయా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఎంపీ సీట్లకి కృతజ్ఞతగా 8 నెలలుగా జరగాల్సిన సీబీఐ దర్యాప్తును అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ కేసు విచారణ ఆలస్యం ఎందుకు అవుతుందో కేంద్ర మంత్రులు సమాధానం చెప్పాలని టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. ల్గ÷తుల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ గతంలో అన్న మాటలు ప్రజలు మర్చిపోలేదన్నారు. రైతులు, పేద ప్రజలకు లాభం చేసిన ప్రభుత్వం తమదే అని చెప్పారు. ధాన్యం కొనుగోలు చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. పంటల దిగుబడులు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా రైతులకి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలతో కాంగ్రెస్ ముందుకు పోతుందన్నారు. బెంగాల్‌లో బీజేపీకి అనుకూల పరిస్థితులు లేవన్నారు. అక్కడ బీజేపీ గెలిచిందంటే.. అది ఓట్ల చోరీ వల్ల మాత్రమే అని టీపీసీసీ చీఫ్ కుండబద్దలు కొట్టారు. బెంగాల్‌లో ఓటు చోరీ జరిగిందని ఆరోపించారు. తెలంగాణలో కూడా అదే పరిస్థితి జరగొచ్చు అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కు కాపాడుకోవాలంటూ తెలంగాణ పౌరులకు ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. అయినా తెలంగాణలో అలాంటి ఆటలు సాగవు అని పేర్కొన్నారు. సర్ పేరిట ఓట్లు దొంగలించడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు.

## బెంగాల్, అసోంలకు బిజెపి పరిశీలకుల నియామకం

మొదటిపేజీ తరువాయి

నియమించింది . అలాగే, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీని సహ పరిశీలకుడిగా నియమించింది. అమిత్ షా, మోహన్ చరణ్ ఆధ్వర్యంలో బెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు, అగ్రనేతలు సమావేశమవుతారు. బెంగాల్ బీజేపీ లెజిస్లేటివ్ నేతను ఎన్నుకుంటారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నుకోవడం, కొత్త ప్రభుత్వ ఏర్పాటును షా, మోహన్ పర్యవేక్షిస్తారు. బెంగాల్‌లో ఈ నెల 9న కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ 207 సీట్లు గెలుచుకుంది. మరోవైపు అసోంకు సంబంధించి ప్రభుత్వ ఏర్పాటుకోసం కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర మంత్రి, బీజేపీ మాజీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను బీజేపీ నియమించింది. నడ్డాతోపాటు సహపరిశీలకుడిగా హరియాణా సీఎం నయాబ్ సింగ్ సైని వ్యవహరిస్తారు. వీరు ఇద్దరూ అసోంలో బీజేపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటు, లెజిస్లేటివ్ పార్టీ లీడర్ ఎన్నికను పర్యవేక్షిస్తారు. అసోంలో బీజేపీ కూటమి 82 సీట్లు గెలుచుకుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ తొలిసారి అధికారం చేపట్టబోతుంది. దీంతో ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో ఆసక్తి నెలకొంది. బీజేపీ అధిష్టానం ఎవరిని నియమిస్తుందో చూడాలి. ప్రస్తుతానికి సువేందు అధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అసోంలో ఇప్పటికే బీజేపీ నుంచి సీఎంగా ఉన్న హిమంత బిశ్వ శర్మ అదే పదవిలో కొనసాగుతారు.

## ఏరోస్పేస్ దిగ్గజాలకు తెలంగాణ వ్యూహాత్మక భాగస్వామి

మొదటిపేజీ తరువాయి

మంగళవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ హార్డ్ వేర్ పార్క్‌లో రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న 'ఐటీపీ ఏరో - ఇండియా' మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ కు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ఆనతికాలంలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌లలో ఒకటిగా తెలంగాణను నిలిపామన్నారు. వరుసగా అయిదేళ్లు కేంద్రం నుంచి 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం రాష్ట్రంలోని పటిష్ఠమైన ఎకో సిస్టమ్‌కు నిదర్శనమన్నారు. బోయింగ్, జీఈ ఏవియేషన్, సాఫ్రాన్, లాక్హీడ్ మార్టిన్, టాటా వంటి గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలు ఇప్పటికే మన దగ్గర కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యన్నారు. తాజాగా... ఈ జాబితాలో స్పెయిన్ దిగ్గజ సంస్థ 'ఐటీపీ ఏరో' కూడా చేరడంతో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమవుతుందన్నారు. సంప్రదాయ తయారీ రంగంతో పాటు డ్రోన్ టెక్నాలజీ, శాటిలైట్ కమ్యూనికేషన్స్ లాంటి నెక్ట్స్ జనరేషన్ టెక్నాలజీస్ లోనూ రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా నిలిపేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అందుకు అవసరమైన... మౌలిక సదుపాయాల కల్పన, ఎకోసిస్టమ్ అభివృద్ధి, ఇన్నోవేషన్, ఆర్ అండ్ డీ, ఇండస్ట్రీ రెడీ వర్క్ ఫోర్స్ తయారీ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. విమాన ఇంజిన్ల తయారీలో వినియోగించే అత్యంత కీలకమైన విడిభాగాలు ఈ 'ఐటీపీ ఏరో ? ఇండియా' నూతన మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ లో ఉత్పత్తి అవుతాయన్నారు. వచ్చే ఏడాది నాటికి ఇక్కడ కార్యకలాపాలు పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయన్నారు. ప్రిసిషన్ ఇంజనీరింగ్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, క్వాలిటీ కంట్రోల్ తదితర విభాగాల్లో ప్రాథమికంగా 350 మంది నిపుణులకు ఉపాధి లభిస్తుందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 600కు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీపీ గ్రూప్ సీఈవో ఈవా అజూలే, ఎండీ కార్లోస్ అల్జోలా, వైస్ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) వాలెంటిస్ గొరోనో, ఐటీపీ ఇండియా ఎండీ సందీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలకు...పాలనకు పొంతన లేదు

మొదటిపేజీ తరువాయి

ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. రిటైర్ ఉద్యోగులకు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద నగదు చెల్లించక పోవడంతో కోర్టు జోక్యం చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేసే పరిస్థితి వచ్చిందంటే.. ప్రభుత్వాన్ని ఎట్లా నడుపుతున్నారో వాళ్లకే తెలియాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న పనులు చేసుకునే కాంట్రాక్టర్లకు బిల్లులు అందక గతంలోనే కాదు.. నేడు కూడా వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఎంపీ ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లకే కాంగ్రెస్ పార్టీ ప్రజల చేత ఛీ కొట్టించుకునే పరిస్థితులు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం బాగుపడాలంటే ఏకైక మార్గం బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అరాచకం, దుర్మార్గాలు జరిగినా.. ఇది నా జాగీరు అని అహంకారంగా పాలించిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీని ప్రజలు ఓడించారని ఎంపీ ఈటల తెలిపారు. తమిళనాడులో స్టాలిన్ మీద ఒక సామాన్యుడు గెలిచాడంటే డీఎంకే ప్రభుత్వంపై ప్రజలకు ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టమైందన్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలని తాను కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. కుటుంబ రాజకీయాలు నడిపేవారు.. ఈ రాష్ట్రానికి తామే ఓనర్లమనే పద్ధతిలో అన్ని వాళ్లే చేసుకునే వారికి, లక్షల కోట్ల రూపాయలు స్కాంలు చేసి డబ్బులు సంపాదించి.. వాటితో ఎన్నికల్లో గెలవాలని కుట్ర చేసే వారికి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అత్యుత్తమ ఉదాహరణ అని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలు.. చిన్న విషయం కాదన్నారు. దీనిపై లోతుగా ఆలోచించాల్సిన విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు ఎంత అప్రమత్తంగా, ఎంత షార్ప్‌గా ఉన్నారో ఈ ఫలితాలను బట్టి మనకు అర్థమవుతుందని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు.

## ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

మొదటిపేజీ తరువాయి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లా జిల్లా గంబిరావుపేట గ్రామంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటేడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా కల్పించకపోవడం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శనమన్నారు. తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం, నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. కేవలం కొన్ని పంటలకే మద్దతు ధర ప్రకటించి మిగిలిన వాటి విషయంలో కేంద్రం తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని, రాష్ట్రం సేకరించిన ప్రతి గింజను కేంద్రమే సేకరించి సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం బహుళార్ధక సాధక ప్రాజెక్టులను నిర్మించి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం కార్యరూపంలోకి తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ఎ÷-లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు. మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించిన ప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు పక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## సింగరేణి కార్మికులకు అభిరామ్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సిలిండర్ల పంపిణీ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 5 : మణుగూరు సింగరేణి కార్మికులకు గ్యాస్ సరఫరాలో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అభిరామ్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా తాత్కాలికంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభించారు. ఇటీవల సింగరేణి కోఆపరేటివ్ ఏజెన్సీ ద్వారా గ్యాస్ పంపిణీలో జరిగిన అవకతవకల నేపథ్యంలో హిందుస్తాన్ పెట్రోలియం సంస్థ మణుగూరు ఏరియాకు గ్యాస్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసింది. దీంతో సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను టిబిజికెఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు హిందుస్తాన్ పెట్రోలియం సేల్స్ ఆఫీసర్ పవన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ప్రత్యామ్నాయంగా అభిరామ్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గ్యాస్ సరఫరా ఏర్పాట్లు చేశారు. ఏప్రిల్ నెల వరకు గ్యాస్ రిజిస్ట్రేషన్ పొందిన కార్మికుల వివరాలను తాత్కాలికంగా అభిరామ్ ఏజెన్సీకి బదిలీ చేసి, వారికి సిలిండర్ల పంపిణీ ప్రారంభించారు. మణుగూరు పట్టణంలో నివసించే కార్మికులు పట్టణంలోని బిగ్ సి సెల్ షోరూం సమీపంలోని అభిరామ్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ నెంబర్ చూపించి గ్యాస్ పొందవచ్చని తెలిపారు. అలాగే పి.వి. కాలనీ ప్రాంతంలో నివసించే వారు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఏజెన్సీ వాహనం ద్వారా గ్యాస్ సిలిండర్లు పొందే విధంగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని, సింగరేణి సూపర్ బజార్‌లో సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఈ తాత్కాలిక విధానం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం మళ్లీ యథావిధిగా పాత విధానంలో గ్యాస్ సరఫరా కొనసాగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సింగరేణి కార్మిక కుటుంబాలు వినియోగించుకోవాలని నాగెల్లి వెంకటేశ్వర్లు కోరారు. సమస్య పరిష్కారానికి సహకరించిన హిందుస్తాన్ పెట్రోలియం సేల్స్ ఆఫీసర్ పవన్‌కు, అభిరామ్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులకు టిబిజికెఎస్ తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## భువనగిరిలో మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి-భువనగిరి, మే 5 : భువనగిరి పట్టణ కేంద్రంలో మే 8, 9, 10 తేదీలలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను భువనగిరి లోని హోటల్ న్యూ వివేరాలో ఘనంగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలోని కుంభం ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల శామ్యూల్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఇతర జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు. అలాగే జిల్లా గ్రంథాలయ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఈ మెగా జాబ్ మేళా ఉపయోగపడుతుందని, ఎక్కువ మంది యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచి వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి

**- రైతుల సౌకర్యార్థం కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్,హెల్ప్ లైన్ నెంబర్ ఏర్పాట్లు 7995050789**

**- ప్రస్తుత వాతావరణ మార్పుల దృశ్య రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ఉండాలి**

**- మరిపెడ, దంతాలపల్లి, తొర్రూరు, పెద్దవంగర మండలా ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణపై**

**- విస్తృతంగా పర్యటించిన అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 05 : జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణలో సహకార శాఖ, ఐకెపి, గిరిజన కార్పొరేషన్, మెప్మా, తదితర శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, టార్పాలిన్స్, గన్ని సంచులు, మ్యాచ్చర్ మిషన్లు, ప్యాడి క్లీనర్స్, రవాణా చేయుటకు వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని, అన్ని శాఖల సమన్వయంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ కె.అనిల్ కుమార్, సంబంధిత అధికారులను కేంద్రాల నిర్వహకులను ఆదేశించారు.ప్రభుత్వ సూచనలు,జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు మంగళవారం మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం, తండ ధర్మారం, అబ్బాయిపాలెం, హేమ దుర్గా రైస్ మిల్లును, దంతాలపల్లి మండలం బిరి శెట్టి గూడెం, పెద్దవంగర మండలం చిట్యాల గ్రామాలలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వ సూచనల మేరకు ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని, రైతు వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు త్వరగా పడే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు,ప్రస్తుత వాతావరణం మార్పుల చేర్పుల నేపథ్యంలో కేంద్రాల వద్ద నిలువ ఉన్న ధాన్యం వర్షంలో తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని వాతావరణ మార్పుల వివరాలను రైతులకు ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలని తెలిపారు.లారీ కాంట్రాక్టర్స్, హమాలీలు,రవాణా చేయు సందర్భంలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎక్కడైనా కేంద్రాల నిర్వహణపై అవకతవకలు, అక్రమాలు జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ తెలిపారు.రైతుల సౌకర్యార్థం ధాన్యం కేంద్రాల నిర్వహణ రవాణా తదితర సందర్భాలలో ఏదైనా సమస్యలు ఏర్పడితే వెంటనే కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నెంబర్ 7995050789 కు సమాచారం అందించాలని కోరారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రమేష్, సివిల్ సప్లై మేనేజర్ నరసింహారావు తహసీల్దారులు కృష్ణవేణి, శ్రీనివాస్, వినోద్, సునీల్ రెడ్డి, సెంటర్ నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

## భూ సేకరణకు మార్కెట్ రేటే ఇవ్వాలి

**ఎంపీ చామలకు వినతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి-భువనగిరి, మే 5 : భువనగిరి మండలం అనాజిపురం గ్రామం గుండా నడికుడి రైల్వే లైన్ కోసం జరుగుతున్న భూసేకరణలో రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు ఎదునూరి మల్లేశం డిమాండ్ చేశా రు.మంగళవారం కలెక్టరేట్‌లో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎకరానికి రూ. 32 లక్షలు చెల్లించాలని నిర్ణయించినప్పటికీ, బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం కనీసం రూ. 1.50 కోట్లు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో భూమికి భూమి ఇవ్వాలని, అది సాధ్యం కాకపోతే భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే అనాజిపురం నుంచి జంపల్లి వరకు రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో, అనాజిపురం స్టేజి వద్ద ఉన్న రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిని రోడ్డుకు అనుగుణంగా విస్తరించాలని కోరారు.




## భద్రాద్రి జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు ప్రారంభం

**ప్రగతి క్రీడా మైదానంలో పోటీలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 5 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు మంగళవారం కొత్తగూడెంలోని ప్రగతి క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జావెలిన్ త్రో, లాంగ్ జంప్ పోటీలను రిజర్వ్ ఇన్స్పెక్టర్ ఓ. సుధాకర్ రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకునే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అలాగే పోలీస్, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ వంటి యూనిఫామ్ ఉద్యోగాలను సాధించడంలో అథ్లెటిక్స్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. యువత క్రమశిక్షణతో సాధన చేస్తూ తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీదర్ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్‌లుగా రాణిస్తున్నారని తెలిపారు. అదే ఉత్సాహంతో ఈ నెల 10న హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి త్రో మరియు జంప్స్ ఛాంపియన్‌షిప్‌లో కూడా విజయం సాధించాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి డి. మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను జిల్లా అథ్లెటిక్ కోచ్‌లు నాగేందర్, ఎ. వందన, ఏస్కే రియాజ్ పాషా సమన్వయంతో నిర్వహించారు. విజేతలకు రిజర్వ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రావు పతకాలు అందజేశారు.

## రైతులకు ఆధునిక సాగుపై అవగాహన కార్యక్రమం

**పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 5 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ పంటలు మరియు ఆధునిక సాగు విధానాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి, ఏడి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలతతో పాటు




ఐదు మండలాల ఏవోలు, ఏఈఓలు పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

**- పాల్వంచ తహసిల్దార్ కార్యాలయం ఎదుట న్యూడెమోక్రసీ ధర్నా**

**- మామిడి, వరి, మొక్కజొన్న పంటల నష్టంపై తక్షణ సర్వే కోరుతూ వినతిపత్రం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, మే 5 : ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన మామిడి, వరి, మొక్కజొన్న రైతులను తక్షణమే ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం పాల్వంచ తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు రాత్రింబవళ్లు కష్టపడి పండించిన పంటలు ఒక్కసారిగా అకాల వర్షాలు, గాలి దుమ్ముల వల్ల నాశనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గాలి దుమ్ముల ప్రభావంతో మామిడి తోటల్లో కాయలు రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అలాగే వరి, మొక్కజొన్న పంటలను రోడ్లపై ఆరబోసిన సమయంలో వర్షం పడటంతో అవి తడిసి పాడైపోయాయని పేర్కొన్నారు. నష్టపోయిన పంటలపై వ్యవసాయ అధికారులతో తక్షణ సర్వే నిర్వహించి రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. తహసిల్దార్ ప్రసాద్ వినతిపత్రాన్ని స్వీకరించి, సంబంధిత అధికారులతో త్వరితగతిన సర్వే నిర్వహించి రైతులకు సహాయం అందించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మంకెన వెంకటే శ్వర్లు, మండల కార్యదర్శి కల్తి రాములమ్మ, నాయకులు కే. మల్లేష్, రాజేష్, కందాల బుచ్చిరెడ్డి, తూము రాజయ్య, బత్తుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల శ్రేయస్సే లక్ష్యం - పాల్వంచ సొసైటీ చైర్మన్‌గా కొత్వాల బాధ్యతల స్వీకారం

**పాలకవర్గంతో కలిసి బాధ్యతలు చేపట్టిన కొత్వాల శ్రీనివాసరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, మే 5 : రైతుల సంక్షేమం కోసం సహకార సంఘం నిరంతరం కృషి చేస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పాల్వంచ సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఎం. జయశ్రీ నుంచి కొత్వాల శ్రీనివాసరావుతో పాటు పాలకవర్గం సభ్యులు పదవి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్‌గా కాంపెల్లి కనకేష్, సభ్యులుగా బుడగం రామ్మోహన్ రావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, జరబన సీతారాంబాబు, సామా జనార్ధనరెడ్డి, భూక్యా కిషన్, యర్రంశెట్టి మధుసూదన్ రావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రైతుల బాగోగుల కోసం తిరిగి పాలకవర్గాలను నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి రైతుకు చేరేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సొసైటీ సీఈఓ జి.లక్ష్మీనారాయణ, సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు.




## గ్రామం నుంచి బూత్ వరకు పటిష్ఠ నిర్మాణం

**- కాంగ్రెస్ కు ఐలయ్య దిశనిర్దేశం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి-భువనగిరి, మే 5 : యాదాద్రి-భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం భువనగిరి బైపాస్ రోడ్డులోని వివేరా హోటల్‌లో డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అధ్యక్షతన నిర్వహించారు.

సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, జిల్లా అభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలని, గ్రామ స్థాయి వరకు సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాలని అయిలయ్య సూచించారు. పార్టీ కార్యకర్తలే బలం అని పేర్కొంటూ, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్రమబద్ధమైన ప్రణాళికతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల శామ్యూల్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నూతి శ్రీకాంత్ తదితరులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కోఆర్డినేటర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## మణుగూరు సొసైటీ చైర్మన్‌గా కుర్రి నాగేశ్వరరావు బాధ్యతల స్వీకారం

**- హైకోర్టు తీర్పుతో తిరిగి పదవిలోకి వచ్చిన పాలకవర్గం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 5 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మణుగూరు సహకార సంఘం చైర్మన్‌గా కుర్రి నాగేశ్వరరావు మంగళవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో సొసైటీ పాలకవర్గాలను రద్దు చేసి ప్రత్యేక అధికారులను నియమించిన నేపథ్యంలో, ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ పాలకవర్గ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు, ప్రత్యేక అధికారుల నియామకాన్ని రద్దు చేస్తూ పూర్వ పాలకవర్గాలను కొనసాగించాలని తీర్పు ఇవ్వడంతో, మణుగూరు సొసైటీ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా ఉన్న దొడ్డ వెంకటేశ్వర్లు కుర్రి నాగేశ్వరరావును ఆహ్వానించి తిరిగి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. మరోసారి ఈ బాధ్యతలు చేపట్టే అవకాశం లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తనకు సహకరించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ దొండేటి రామ్మోహన్ రావు, డైరెక్టర్ పిన్నమనేని మాధవి, సీఈఓ సునీల్, బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్‌తో పాటు పలువురు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మణుగూర్‌లో నివాసయోగ్యం లేని సింగరేణి క్వార్టర్లపై ఖాళీ చేయాలని సింగరేణి అధికారుల అల్టిమేటం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మణుగూరు, మే 5 : మణుగూరు ఏరియాలోని పి.వి. కాలనీలో నివాసయోగ్యం లేని సింగరేణి క్వార్టర్లను ఖాళీ చేయాలని యాజమాన్యం స్పష్టం చేసింది. అక్రమంగా నివసిస్తున్న వారు రెండు రోజుల్లోగా క్వార్టర్లను ఖాళీ చేయకపోతే కూల్చివేత చర్యలు చేపడతామని హెచ్చరించింది. మంగళవారం హౌస్ అలాట్మెంట్ కమిటీ సభ్యులు, సింగరేణి అధికారులు మరియు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు పి.వి. కాలనీలో పర్యటించి క్వార్టర్ల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా నివాసయోగ్యం కాని క్వార్టర్లను గుర్తించి, ఖాళీగా ఉన్న 10 క్వార్టర్లను తక్షణమే కూల్చివేశారు. అక్రమంగా నివసిస్తున్న ఇతర క్వార్టర్లకు విద్యుత్, నీటి సరఫరాను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. గడువు ముగిసిన అనంతరం ఆ క్వార్టర్లను కూడా పూర్తిగా కూల్చివేయడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ విషయమై అడిషినల్ జనరల్ మేనేజర్ (పర్సనల్) మరియు అధికార ప్రతినిధి ఎస్.రమేశ్ మాట్లాడుతూ, అక్రమంగా నివసిస్తున్న వారు వెంటనే క్వార్టర్లను ఖాళీ చేసి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో ఎస్ఓటుజీఎం బి. శ్రీనివాస చారి, డీజీఎం (సివిల్) జి.శివ ప్రసాద్, ఏరియా సర్వే అధికారి ఎల్.దయాకర్, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ కల్లెపు స్వప్న, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, గుర్తింపు సంఘం నాయకులు రాంనర్సయ్య, ప్రాతినిధ్య సంఘం నాయకులు వి. కృష్ణం రాజు, ఈఈ (సివిల్) రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై సీసీఎస్ పోలీసుల దాడి

**6 మంది అరెస్ట్...నగదు, వాహనాలు స్వాధీనం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 5 : జిల్లాలో అక్రమ కార్యకలాపాలపై కొనసాగుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా పేకాట శిబిరంపై సీసీఎస్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబటిపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పేకాట శిబిరంపై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 33,470 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, ఏడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన నిందితులను, స్వాధీనం చేసిన వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. జిల్లాలో పేకాట శిబిరాలు, జూదం వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com